ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



బాపట్ల జిల్లా వార్తలు

సోమవారం 1 ఏప్రిల్ 2024

బాపట్ల బ్రహ్మరథం పట్టింది.. సముద్ర తీరం జనసందోహంతో పోటెత్తింది.. ప్రజాగళం విజయవంతం అయింది. ప్రచారంలో భాగంగా, ప్రజాగళం సభలో పాల్గొనేందుకు తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు బాపట్లకు విచ్చేశారు. ఆయనకు అడుగడుగునా ప్రజలు స్వాగతం పలికారు. అశేష జనసందోహాన్ని ఉద్దేశించి ఆయన ప్రసంగించి వారిలో చైతన్యాన్ని నింపారు. బాపట్ల వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దోపిడీ దారుడని, కూటమి అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ సేవాభావం కలవాడని ఎవరికి పట్టం కట్టాలో ప్రజలే తేల్చుకోవాలన్నారు. ఆయన ప్రసంగానికి విశేష స్పందన లభించింది. టీడీపీ, జనసేన, బీజేపీ జెండాల రెపరెపలతో బాపట్ల కొత్త శోభను సంతరించుకుంది.





బాపట్లలో జరిగిన ప్రజాగళం సభకు హాజరైన జనసందోహం

బాపట్ల.. బ్రహ్మరథం

- మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజాగళం సభకు విశేష స్పందన
- ఎమ్మెల్యే కోన రఘుపతి దోపిడీ దారుడు
- టీడీపీ అభ్యర్థి నరేంద్రవర్మ సేవా దృక్పథం కలిగిన వారు
- ఎవరికి పట్టం కట్టాలో ప్రజలే తేల్చుకోండి
- బాపట్లకు వరాల జల్లు
- ఇంజనీరింగ్ కళాశాల వద్ద నుంచి అంబేద్కర్ కూడలి వరకు రోడ్‌షో

బాపట్ల, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు బాపట్ల ప్రజానీకం అడుగడుగునా బ్రహ్మరథం పట్టింది. ప్రజాగళం సభలో పాల్గొనడానికి ఆదివారం బాపట్లకు వచ్చిన టీడీపీ అధినేత చంద్రబాబు సాయంత్రం 6:20 గంటల సమయంలో ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌లో దిగారు. అక్కడ నుంచి అంబేద్కర్ కూడలికి బయల్దేరిన చంద్రబాబుకు అడుగడుగునా ప్రజలు బ్రహ్మరథం పట్టారు. 216 జాతీయ రహదారిలోని కుక్కలవారిపాలెం, దరివాదకొత్తపాలెం మీదుగా చంద్రబాబు పట్టణంలోని అంబేద్కర్ కూడలికి చేరుకున్నారు. అక్కడ హాజరైన అశేష జనసందోహం అధినేతకు ఘన స్వాగతం పలికింది. సైకో పోవాలి సైకిల్ రావాలి అనే నినాదాలతో సభా ప్రాంగణం హోరెత్తింది. టీడీపీ, జనసేన, బీజేపీ జెండాల రెపరెపలతో అంబేద్కర్ కూడలి కొత్త శోభను సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో బాపట్ల ఎంపీ అభ్యర్థి కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన, ఎమ్మెల్యేలు ఏలూరి, గొట్టిపాటి, అనగాని మాజీమంత్రి నక్కా ఆనంద్ బాబుతో పాటు సంతనూతలపాడు ఎమ్మెల్యే అభ్యర్థి బీఎన్ విజయకుమార్, చీరాల అసెంబ్లీ అభ్యర్థి కొండయ్య యాదవ్, జనసేన బాపట్ల ఇన్‌చార్జి నామన శివన్నారాయణతో పాటు టీడీపీ తెలుగు మహిళ కార్యదర్శి మానం విజేత, తాతా జయప్రకాష్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

గెలుపుపై అనుమానం లేదు..

బాపట్ల ప్రజలు పలికిన అపూర్వ స్వాగతం చూస్తుంటే తనకు గెలుపుపై ఎలాంటి అనుమానం లేదని చంద్రబాబు అన్నారు. ఈస్టర్ రోజు బాపట్లలో ఉండడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు అన్నారు. భారత రాజ్యాంగాన్ని రాసి మనకు ఇచ్చిన అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రాంలు మార్చి నెలలోనే పుట్టారన్నారు. గడచిన ఏడాది డిసెంబరులో తాను మిచౌంగ్ తుఫాన్ బాధితులను పరామర్శించడానికి బాపట్లకు వచ్చి వారికి ధైర్యం చెప్పానని గుర్తు చేశారు.



ప్రసంగిస్తున్న చంద్రబాబు, పక్కన ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు తేనేటి కృష్ణప్రసాద్, వేగేశన నరేంద్రవర్మ

ఆకట్టుకున్న చంద్రబాబు ప్రసంగం..

చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ బాపట్ల వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దోపిడీ దారుడని, కూటమి అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ సేవాభావం కలవాడని ఎవరికి పట్టం కట్టాలో ప్రజలే తేల్చుకోవాలన్నారు. వైసీపీ ఎంపీ అభ్యర్థి ఒక రౌడీ అని, కూటమి అభ్యర్థి కృష్ణప్రసాద్ నిజాయితీగల ఐపీఎస్ అధికారిగా సేవలందించాడని గెలిపించి పార్లమెంట్‌కు పంపిస్తే అభివృద్ధి దిశగా బాపట్లను నడిపిస్తాడన్నారు. గతంలో తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎన్నో ప్రాజెక్టుల్లో తనతో కలిసి పనిచేసిన అనుభవం కూడా ఎంపీ అభ్యర్థి కృష్ణప్రసాద్ సొంతం అన్నారు. ఆక్వా రంగం కుదేలైందని రూ.1.50కే కరెంట్ ఇచ్చే బాధ్యత తీసుకుంటామని అన్నారు. మత్స్యకారులను దెబ్బతీసే విధంగా తీసుకొచ్చిన జీవో నెం.217ను రద్దు చేసి స్వేచ్ఛని కల్పిస్తానన్నారు. బాపట్లను టూరిజం హబ్‌గా మార్చడంతో పాటు ఆక్వా, అగ్రికల్చర్‌ను అభివృద్ధి చేస్తానని చంద్రబాబు అన్నారు.

తేడా చూడాలి...

బాపట్ల టీడీపీ అభ్యర్థి నరేంద్రవర్మ ఎలాంటివాడో, ఇక్కడున్న వైసీపీ అభ్యర్థి ఎలాంటి వాడో తేడా ప్రజలు గమనించాలని చంద్రబాబు కోరారు. బాపట్లకు టిడ్కో ఇళ్లను రానివ్వకుండా చేశాడన్నారు. ఇక్కడున్న ఎంపీ అభ్యర్థి కృష్ణప్రసాద్ గతంలో ఐపీఎస్ అధికారిగా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో భాగస్వామి అయ్యారు. ఆయనను గెలిపిస్తే బాపట్ల అభివృద్ధి చెందుతుంది. ఎంపీ అభ్యర్థి కృష్ణప్రసాద్ పనితీరును వ్యక్తిగతంగా నేను చూశానన్నారు. మంచి వ్యక్తని, నీతి, నిజాయితీలతో బతికి పదిమందికి ఉపయోగపడ్డాడని కితాబిచ్చారు. అందుకే వెతికి వెతికి ఓ సామాజిక వర్గానికి న్యాయం చేయాలని కృష్ణప్రసాద్‌కు అవకాశం ఇచ్చామన్నారు. ఎంపీ,ఎమ్మెల్యేలిద్దరిని గెలిపించాల్సిన బాధ్యతప్రజలపై ఉందన్నారు.

అన్ని స్థానాలు గెలవాలి

బహిరంగ సభ అనంతరం ఇంజనీరింగ్ కళాశాలకు వెళ్లిన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు బాపట్ల పార్లమెంట్ పరిధిలోని నాయకులందరితో బస్సులో సమావేశమయినట్లు సమాచారం. 7 అసెంబ్లీ స్థానాలతో పాటు పార్లమెంట్ స్థానంలో కూడా కచ్చితంగా విజయం సాధించాల్సిందేనని చెప్పినట్లు సమాచారం. ఇందుకోసం చేపట్టాల్సిన కార్యక్రమాలపై నేతలకు దిశానిర్దేశం చేశారు.జనసేన, బీజేపీ నేతలతో సమన్వయంతో పనిచేయాలని సూచించినట్లు తెలుస్తోంది. మళ్లీ త్వరలోనే జిల్లా పరిధిలో పర్యటనకు వస్తానని ఆలోగా ఎక్కడైనా ఇబ్బందులుంటే పరిష్కరించుకోవాలని నేతలకు సూచించినట్లు తెలుస్తోంది.

గుంటూరు లోక్‌సభ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్‌తో అరగంట పాటు ప్రత్యేకంగా చంద్రబాబు సమావేశమయ్యారు. కర్లపాలెం వైసీపీ నేతలు, అప్పికట్ల వైసీపీ సర్పంచ్ గుత్తికొండ రజనీ, అల్లం గోపి తదితర నాయకులు టీడీపీలో చేరారు.



రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సాయంత్రం) 6.26(సోమవారం)

సహోరీ (ఉదయం) 4.46 (మంగళవారం)

పింఛన్.. జాప్యం!

- మూడో తేదీ తరువాతే...
- నిధులు లేక వాయిదా వేసిన ప్రభుత్వం
- ఎన్నికల కమిషన్‌పై నెపం మోపి కొత్త నాటకం
- సచివాలయాల వద్ద పంపిణీకి ఏర్పాట్లు
- ప్రతిపక్షాల మీద విషం చిమ్మడమే లక్ష్యంగా ప్రచారం

గుంటూరు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ప్రతి నెలా ఒకటో తేదీన ఠంచనుగా పింఛను అందజేస్తాం అని చెబుతూ వస్తున్న ప్రభుత్వం గత కొంత కాలంగా పింఛన్ల పంపిణీలో పిల్లిమొగ్గలు వేస్తోం ది. ఖజానా మొత్తాన్ని ఖాళీ చేసిన



ప్రభుత్వం పింఛను పంపిణీకి నిధులు దొరక్క రకరకాల కారణాలు చెబుతూ ప్రతి నెలా ఒకటో తేదీన పింఛన్లు పంపిణీ చేయకుండా తప్పుకుంటూ వస్తోంది. కొత్త ఏడాది తొలిరోజైన జనవరి ఒకటో తేదీన కూడా పింఛనుదారులకు ఇదే అను భవం ఎదురైంది. ఫిబ్రవరి నెలలోనూ అదే పరి స్థితి. కాగా ఈనెల కూడా పింఛను పంపిణీ వాయిదా పడింది. నిధులు లేవన్న వాస్తవాన్ని మరుగుపరిచి ఎన్నికల కమిషన్‌పై నెపం మోపేందుకు ప్రయత్నిస్తోంది.


ప్రతిపక్షాల మీదకు నెపం

నిధులు లేక ఆగిపోయిన పింఛను పంపిణీకి కారణం ప్రతిపక్షాలే అని ఎదురుదాడి చేసేందుకు ప్రభుత్వం పూనుకుంటోంది. ప్రతిపక్షాలు వలం టీర్లపై ఫిర్యాదులు చేసి, వారిని పింఛను పంపిణీకి రాకుండా అడ్డుకున్న కారణంగా పింఛన్ల పంపిణీ ఆగిపోయిందనే విధంగా ప్రచారం సాగిస్తున్నారు. వారి వల్లే పింఛన్ల పంపిణీ పూర్తిగా ఆగిపోయి, నగదు అందకుండా పోతోందని కొన్ని చోట్ల ప్రతిపక్షాలపై విషం చిమ్మే పనులు చేస్తు న్నారు. ఎన్నికల కమిషన్ ప్రభుత్వోద్యోగులతో పంపిణీ చేయించాలని చెప్పిన విషయాన్ని మరుగుపెట్టి లబ్ధిదారులను వంచించేందుకు ప్రయత్నిస్తున్నారు. లబ్ధిదారులను ఆందోళనకు గురి చేయడం ద్వారా ప్రతిపక్షాల పట్ల వారిలో వ్యతిరేకత తీసు కురావచ్చని అధికార పక్ష నేతలు భావిస్తున్నారు. అందుకోసం పింఛన్ల పంపిణీని సచివాలయాలకు పరిమితం చేశారు. సచివాలయ ఉద్యోగుల ద్వారా డోర్ డెలివరీ చేయకుండా పింఛనుదారులనే సచివాలయాలకు రప్పించి అక్కడే ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. తద్వారా అక్కడ పడిగాపులు పడే లబ్ధిదారుల్లో ప్రతిపక్షాల పట్ల వ్యతిరేక భావం కలిగేలా చేయాలని చూస్తున్నారని ప్రతిపక్ష పార్టీలు ఆరోపిస్తున్నాయి. అయితే నిధులు లేక పంపిణీ ఆగిందన్న విషయం గ్రహించిన లబ్ధిదారులు ప్రభు త్వం, వలంటీర్లతో చేయిస్తున్న ప్రచారాన్ని అంతగా పట్టించుకోవడం లేదు.

బ్యాంకులకు సెలవలంటూ బుకాయింపులు

మార్చి నెల 31తో ఆర్థిక సంవత్సరం ముగిసి ఏప్రిల్ ఒకటి నుంచి కొత్త ఆర్థిక సంవత్సరం మొ దలవుతోంది. బ్యాంకు లావాదేవీల ముగింపు కారణంగా సకాలంలో పింఛన్లు ఇవ్వలేకపోతున్నామని అధికారులు చెబుతున్నారు. ఇందులో వాస్తవం లేదని తెలుస్తోంది. పింఛన్లు ఏప్రిల్ ఒకటో తేదీ సోమవారం నుంచి పంపిణీ చేయాల్సిన నేపథ్యంలో శనివారం, ఆదివారం సెలవులు కాబట్టి నిధులను ప్రభుత్వం శుక్రవారంనాటికే బ్యాంకుల్లో డిపాజిట్ చేయాలి. అలా చేయలేదని తెలుస్తోంది. పైగా ఈనెల ఆఖరి శనివారం, ఆదివారం కూడా బ్యాంకులు పనిచేశాయి. అది కూడా ప్రభుత్వానికి కలిసి వచ్చే అంశమే అయినప్పటికీ బ్యాంకుల్లో నిధులు జమకాలేదని తెలుస్తోంది. కాగా ఇప్పుడు సోమవారం బ్యాంకులకు సెలవు అందువల్ల మూ డో తేదీకి వాయిదా వేస్తున్నామని చెబుతున్నారు.

దిక్సూచి DIKSUCHI



కన్ను గురించి అధ్యయనం చేసే శాస్త్రాన్ని ఆప్తాల్మాలజి అంటారు. కన్ను దృష్టికి సంబంధించిన జ్ఞానాంగం. పుర్రెలోని నేత్రగుళికలో కన్ను ఇమిడి ఉంటుంది. కన్నులో నేత్రగోళం, అనుబంధ నిర్మాణాలు(కనురెప్పలు, కంటి పక్ష్మాలు, కనుబొమ్మలు, అశ్రు పరికరం, వెలుపలి కండరాలు) ఉంటాయి. అశ్రు పరికరంలోని నిర్మాణాలు, కన్నీటిని ఉత్పత్తి చేస్తుంది. కన్నీటిలో లవణాలు, శ్లేష్మం, సూక్ష్మ జీవనాశక ఎంజైమ్ లైసోజోమ్ ఉంటాయి. నేత్రగుళికలో నేత్రగోళం కదలిక ఆరు కండరాల సహాయంతో జరుగుతుంది.

నేత్రగోళపు పొరలు

నేత్రగోళ కుడ్యంలో మూడు పొరలు ఉంటాయి. అవి ఒకదాని వెనక ఒకటి ఉంటాయి. అవి- 1) తంతు పటలం 2) ప్రసరణ పటలం 3) రెటీనా

తంతు పటలం: ఇది నేత్రగోళం వెలుపలి పొర. దీని పూర్వాంతంలో కార్ని యా, పరాంతంలో దృఢస్తరం(స్క్లీరా) ఉంటాయి. కార్నియా రక్తనాళరహిత పారదర్శక పొర, ఇది స్థిరకటకంగా ఉండి ఐరిస్‌ను కప్పుతుంది. కార్నియాను ఆవరించి కంజెక్టివా ఉంటుంది. నేత్రదాన ప్రక్రియలో కార్నియాను మాత్రమే సేకరిస్తారు. మృతిచెందిన వ్యక్తి నుంచి నేత్రాలను ఆరుగంటల లోపు తీసుకోవాల్సి ఉంటుంది. స్క్లీరా అనేది కంటిలోని తెల్లని భాగం. ఇది అంతర్భాగాలకు రక్షణనిస్తుంది.

ప్రసరణ పటలం: దీనిని యూవియా అని కూడా పిలుస్తారు. ఇది నేత్రగోళం మధ్యపొర. దీనిలో మూడు భాగాలుంటాయి. అవి- ఎ) కొరాయిడ్ బి) సిలియరి బాడీ సి) ఐరిస్. కొరాయిడ్ అనేది విరివిగా రక్తనాళాలతో కూడి నీలివర్ణంలో ఉంటుంది. సిలియరిబాడీలోని నునుపు కండరాలు కంటి కటకాన్ని నిర్దిష్టస్థానంలో ఉంచడానికి, కటకం ఆకారాన్ని హ్రస్వదృష్టి, దీర్ఘదృష్టికి అనుకూలంగా మార్చడానికి ఉపయోగపడతాయి. ఐరిస్ అనేది నేత్రగోళంలోని వర్ణక ప్రాంతం. ఇది కార్నియాకు కటకానికి మధ్య సస్‌పెండెడ్‌గా ఉంటుంది. ఐరిస్ మధ్యలో కనుపాప ఉంటుంది. ఇది కెమెరాలోని డయాఫ్రమ్‌లా పనిచేస్తుంది. రాత్రిపూట సంచరించే నిశాచర జీవుల్లో ఐరిస్ పైన పడిన కాంతి పరావర్తనం చెందడం వల్ల వాటి కళ్లు మెరుస్తాయి.

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

రెటీనా: ఇది నేత్రగోళంలోని లోపలిపొర. దీనిలో పిగ్మెంటెడ్ ఎపిథీలియం, నాడీప్రాంతం అనే రెండు భాగాలుంటాయి. పిగ్మెంటెడ్ ఎపిథీలియం అనేది ఒక మెలనిన్ ఆచ్ఛాదం. నాడీ ప్రాంతంలో ఫోటోరిసెప్టార్ లేయర్, బైపోలార్ సెల్ లేయర్, గాంగ్లియాన్ సెల్ లేయర్ అనే మూడు పొరలుంటాయి. ఫోటోరిసెప్టార్ లేయర్‌లో రాడ్స్, కోన్స్ అనే రెండురకాల కాంతి గ్రాహకాలు ఉంటాయి. రాడ్స్, కోన్స్ మధ్య నిష్పత్తి 15:1. రాడ్స్ అనేవి రొడాప్సిన్ అనే వర్ణకాన్ని కలిగి ఉంటాయి. రాడ్ సెల్ అతి తక్కువ కాంతిలో అనగా చీకటిలో వస్తువులను చూడటానికి పనికొస్తాయి. కానీ వివిధ రంగులను గుర్తించలేవు. కోన్ సెల్స్‌లో అయోడాప్సిన్ అనే వర్ణక పదార్థం ఉంటుంది. కోన్‌సెల్స్ కాంతివంతమైన వెలుతురులో వస్తువులను చూడటానికి ఉపయోగపడతాయి. ఇవి రంగులను గుర్తిస్తాయి. రెటీనా పరాంత మధ్య భాగాన్ని మాక్యులాల్యూటియా లేదా పసుపుచుక్క అంటారు. పసుపు చుక్కలో కోన్‌సెల్స్ అధికంగా ఉంటాయి. కంటిలో ప్రతిబింబం ఏర్పడే ప్రాంతమే ఈ పసుపు చుక్క.

నేత్రగోళం నుంచి వార్తలను మెదడుకి చేరవేసే నాడిని దృక్ నాడి అంటారు. రెటీనాతో దృక్‌నాడి కలిసే ప్రాంతాన్ని బ్లైండ్ స్పాట్ అంటారు. దీనిలో ఏవిధమైన కాంతి గ్రాహకాలు ఉండవు. అందువల్ల ఈ ప్రదేశంలో ప్రతిబింబాలు ఏర్పడవు. రెటీనాను కెమెరాలోని ఫిల్మ్‌తో పోల్చవచ్చు. నేత్రగోళ కుహరంలో ఐరిస్ వెనుక ద్వికుంభాకార కటకం ఉంటుంది. ఇది సర్దుబాటు చేసుకునే కటకం. దీనిని కెమెరాలోని కటకంతో పోలుస్తారు. చూసే వస్తువు దూరాన్ని బట్టి ఈ కటకం తన నాభ్యాంతరాన్ని మార్చుకుంటుంది. కన్ను లోపలి భాగాన్ని కటకం పూర్వాంతపు, పరాంత కక్ష్యలుగా విభజిస్తుంది. పూర్వాంతపు కక్ష్యను ఆక్వియస్ చాంబర్ అని, పరాంతపు కక్ష్యను విట్రియస్ చాంబర్ అని అంటారు. ఆక్వియస్ చాంబర్‌లోని ద్రవం కటకానికి, కార్నియాకి పోషక పదార్థాలను అందిస్తుంది. విట్రియస్ చాంబర్‌లోని ద్రవం అంతరనేత్ర ఒత్తిడిని స్థిరంగా ఉంచి నేత్రగోళం ఆకారాన్ని కాపాడుతుంది.

కన్ను పనిచేసే విధానం

కన్ను కాంతిని సేకరించి కుంభాకార కటకం ద్వారా కేంద్రీకరించి, కంటిలో వెనుక భాగాన ఉండే రెటీనాపై ప్రతిబింబాన్ని ఏర్పరుస్తుంది. కటకం వల్ల ఏర్పడే ప్రతిబింబంలో ఎడమ కుడిగాను, తలకిందులుగాను ఉంటుంది. మెదడులోని జ్ఞానకేంద్రాల్లో పటాలన్నీ సాధారణంగా తిరగబడి, తలకిందులుగా అవుతాయి. నాడీ కణాలన్నీ కట్టలా కలిసి, కంటి నుంచి దృష్టి సమాచారాన్ని మెదడుకు పంపించే దృక్ నాడిని ఏర్పరుస్తాయి. రెండు కళ్లూ సేకరించిన రెండు దృశ్యాలను కలిపి ఒక త్రిమితీయ పటంగా మెదడు తయారుచేస్తుంది. కంటిగుడ్డులో మన కంటికి కనిపించే భాగం 1/6వ వంతు మాత్రమే. కంటికి, టీవీకి మధ్యదూరం 2 1/2 మీటర్లు లేదా ఆరు అడుగులు ఉండాలి. కంటికి, పుస్తకానికి మధ్య దూరం 30 సెం.మీ. ఉండాలి. ఒక ప్రతిబింబం ముద్ర రెటీనా మీద ఉండే సమయం 1/6 సెకన్లు మాత్రమే. కంటిచూపు లేనివారిని అంధులు అంటారు. లూయిస్ బ్రెయిలీ స్పర్శ ద్వారా చదివే బ్రెయిలీ లిపిని అంధుల కోసం కనుగొన్నారు. ఈయన ఫ్రెంచ్ దేశీయుడు. అంధుల కోసం ఆరు చుక్కల బ్రెయిలీ లిపిని ఆవిష్కరించారు.



కె. నాగశేషులు
బయాలజీ ఫ్యాకల్టీ

'జమిలి/ ఏకకాల ఎన్నికలు' అనగా లోక్‌సభ, రాష్ట్ర శాసన సభలు, పట్టణ/ గ్రామీణ స్థానిక సంస్థలన్నింటికీ ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం. అధికారపక్ష బీజేపీ మానిఫెస్టో అంశమైన జమిలి ఎన్నికల సాధ్యాసాధ్యాల పరిశీలనకు మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అధ్యక్షతన నియమించిన ఉన్నతస్థాయి కమిటీ 2024 మార్చి 14న జమిలి ఎన్నికలను సిఫార్సు చేస్తూ నివేదిక సమర్పించడంతో ఈ అంశం మరోసారి చర్చనీయాంశం అయింది.

జమిలి ఎన్నికలు
వివిధ కమిటీల సిఫార్సులు



ఈ నేపథ్యంలో రామ్‌నాథ్ కోవింద్ కమిటీ సిఫార్సులు, జమిలి ఎన్నికలపై గతంలో పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ, లా కమిషన్‌లు, ఎలక్షన్ కమిషన్ వెల్లడించిన అభిప్రాయాలు, జమిలి ఎన్నికల వల్ల లాభనష్టాలను పరిశీలించాల్సిన అవసరం ఉంది.

రామ్‌నాథ్ కోవింద్ కమిటీ సిఫార్సులు

ప్రభుత్వం జమిలి ఎన్నికలపై సిఫార్సుల కోసం మాజీ రాష్ట్రపతి కోవింద్ అధ్యక్షతన, ఎనిమిదిమంది సభ్యులతో ఒక ఉన్నత స్థాయి కమిటీని(హెచ్‌ఎల్‌సీ) నియమించింది. దీనినే 'వన్ నేషన్, వన్ ఎలక్షన్ కమిటీ'గా కూడా వ్యవహరిస్తారు. ఈ కమిటీకి ఛైర్మన్‌గా రామ్‌నాథ్ కోవింద్ ఉండగా సభ్యులుగా అమిత్‌షా(కేంద్ర హోంమినిస్టర్), హరీష్ సాల్వే(సీనియర్ అడ్వకేట్), సుభాష్ కాశ్యప్(లోక్‌సభ మాజీ సెక్రటరీ జనరల్), ఎన్.కె.సింగ్(కేంద్ర 15వ ఆర్థికసంఘం మాజీ ఛైర్మన్), సంజయ్ కొఠారి (సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ మాజీ కమిషనర్), గులాం నబీ ఆజాద్(రాజ్యసభ మాజీ ప్రతిపక్ష నాయకుడు), అధిర్ రంజన్ చౌదరి(లోక్‌సభ కాంగ్రెస్ నాయకుడు- ఈయన కమిటీలో ఉండటానికి నిరాకరించారు) ప్రత్యేక ఆహ్వానితులుగా కేంద్ర న్యాయశాఖమంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ ఉంటారు. లా సెక్రటరీ ఈ కమిటీకి సెక్రెటరీగా వ్యవహరిస్తారు.

ఈ కమిటీ మొత్తం 65 సమావేశాలు నిర్వహించి, 18,626 పేజీల నివేదికను 2024 మార్చి 14న రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు సమర్పించింది. ఈ కమిటీ జమిలి ఎన్నికలను ఏకగ్రీవంగా సమర్థిస్తూ వాటిని జరపడానికి చేపట్టాల్సిన సముచిత చర్యలు, రాజ్యాంగ సవరణలు, ఎదురుకానున్న కొన్ని కీలక సమస్యలకు పరిష్కార మార్గాలను సూచిస్తూ ఒక సమగ్ర నివేదికను రూపొందించింది.

కమిటీ సిఫార్సుల్లో ప్రధానాంశాలు

1. తొలుత లోక్‌సభ, రాష్ట్ర శాసనసభలకు ఏకకాలంలో ఎన్నికలు జరిపి, ఈ ఎన్నికలు పూర్తయిన వందరోజుల్లోగా స్థానిక సంస్థలకు ఎన్నికలు జరపాలి.
2. ఎప్పటినుంచి జమిలి ఎన్నికలు అమల్లోకి రావాలనే విషయాన్ని సార్వత్రిక ఎన్నికలు ముగిసిన తరవాత ఎన్నికయ్యే కొత్త ప్రభుత్వం నిర్ణయిస్తుంది.
3. జమిలి ఎన్నికలను తొలిసారి జరిపేటప్పుడు ఒక అపాయింటెడ్ డేట్‌ను నిర్ణయించాలి. అప్పటికి లోక్‌సభతో పాటు అన్ని రాష్ట్రాల శాసనసభ కాలపరిమితి ముగిసినట్లు భావించవచ్చు. ఇక్కడ అయిదు సంవత్సరాల కాలపరిమితిలో హెచ్చుతగ్గులతో సంబంధం లేకుండా స్థిరీకరించవచ్చు.
4. హంగ్‌హౌస్ లేదా అవిశ్వాస తీర్మానం నెగ్గడం వంటి సందర్భాల్లో మరలా ఎన్నికలు నిర్వహిస్తారు. అయితే మిగిలిన కాలపరిమితి వరకే ఆ ప్రభుత్వాలు కొనసాగుతాయి. ఈవిధంగా కేంద్ర, రాష్ట్ర స్థాయుల్లో ప్రభుత్వాల పాలన కాలాన్ని సమాంతరం చేయవచ్చు.
5. జమిలి ఎన్నికలను ప్రవేశపెట్టడానికి కొన్ని రాజ్యాంగ ప్రకరణలను సవరించడంతోపాటు, కొన్ని అంశాలపరంగా కనీసం సగం రాష్ట్రాల ఆమోదం సాధించాల్సి ఉంటుంది. రాష్ట్రాల శాసనసభల కాలావ్యవధికి సంబంధించిన రాజ్యాంగ ప్రకరణ 172, లోక్‌సభ కాలావధికి సంబంధించిన రాజ్యాంగ ప్రకరణ 83లను సవరించాలి. అదేవిధంగా కేంద్ర, రాష్ట్ర శాసనసభలతోపాటు స్థానిక సంస్థలకు కూడా ఒకేసారి ఎన్నికలు నిర్వహించేందుకు విధివిధానాలు గల ఒక కొత్త ప్రకరణను, ప్రకరణ 324కు జోడించి 324(ఎ)ను రూపొందించాలి.
6. కేంద్ర, రాష్ట్రాలకు, స్థానిక ప్రభుత్వాలకు కలిపి సంయుక్తంగా ఒకే ఓటర్ల జాబితా ఉండాలి. దానికోసం కేంద్ర, రాష్ట్ర ఎన్నికల కమిషన్లతో కలిసి 'యూనిఫైడ్ ఎలక్టోరల్ రోల్'ను ఏర్పాటుచేసి, ఒకే ఓటరు ఐడీ కార్డును జారీ చేయాల్సి ఉంటుంది. దీనికోసం రాజ్యాంగ ప్రకరణ 325లో మార్పులు చేయాల్సి ఉంటుంది. ఈ సవరణలకు కనీసం సగం రాష్ట్ర ప్రభుత్వాల మద్దతు అవసరం.

లా కమిషన్ సిఫార్సులు(2018)

1999, 2018ల్లో లా కమిషన్లు జమిలి ఎన్నికల ఆవశ్యకత గుర్తిస్తూ ఇంచుమించుగా ఒకే సిఫార్సులు చేశాయి. అవి-

- జమిలి ఎన్నికల వల్ల ప్రజాధనం ఆదా అవుతుంది. ప్రభుత్వ వర్గాలపై భద్రతా బలగాలపై పనిభారం తగ్గుతుంది.
- ప్రభుత్వ పథకాలు, పాలన నిరంతరాయంగా కొనసాగేందుకు అవకాశం ఉంటుంది.
- ప్రస్తుతం ఉన్న రాజ్యాంగంలో కనీసం అయిదు సవరణలన్నా చేయాల్సి ఉంటుంది. 50 శాతం రాష్ట్రాలు ఈ సవరణలకు ఆమోదం తెలపాలి.
- ప్రజా ప్రాతినిధ్యచట్టం(1951), లోక్‌సభ, అసెంబ్లీల నియమ నిబంధనల్లో కూడా మార్పులు తేవాలి.
- అవిశ్వాస తీర్మానాలు నెగ్గడం లేదా గడువుకు ముందే ప్రభుత్వాలు రద్దును కోరినప్పుడు మిగతా కాలం ప్రభుత్వాలు కొనసాగేందుకు ఏంచేయాలి అన్నది జమిలి విధానానికి ఉన్న ప్రధాన అవరోధం.
- ఒక ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టినప్పుడు, ఏ ప్రభుత్వం కొనసాగుతుందో చెప్పే విశ్వాస తీర్మానం కూడా నెగ్గాల్సి ఉండటం వంటి ఏర్పాట్లు ఉండాలి.

పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ, లా కమిషన్, ఎలక్షన్ కమిషన్ అభిప్రాయాలు

పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ(2015) సూచనలు

- వేర్వేరు ఎన్నికలు అధికవ్యయంతో కూడుకున్నవి.
- తరచూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి(ఎంసీసీ) అమలులోకి రావడంతో పాలసీ పెరాలసిస్(పథకాల స్తంభన) ఏర్పడుతుంది. దీనితో అత్యవసరంగా చేపట్టాల్సిన పాలన చర్యలకు అవరోధాలు కలుగుతున్నాయి.
- తరచూ ఎన్నికలతో మానవ వనరులపై అధిక పని భారం, ఒత్తిడి పెరుగుతుంది.
- జమిలి ఎన్నికలు దేశవ్యాప్తంగా ఒకేసారి కన్నా కొంత వ్యవధితో రెండు దఫాలుగా జరపడం ఆచరణ సాధ్యంగా ఉంటుంది.
- తమ కాలవ్యవధి పూర్తిచేసుకునే సమయం ఆధారంగా రాష్ట్రాలను వర్గీకరించి ఒక ఏడాదిలో రెండు దఫాలుగా తొలుత ఎన్నికలు జరపాల్సి ఉంటుంది. జమిలిని ప్రవేశపెట్టిన మొదటి సంవత్సరం పాలన కాలం కొన్ని రాష్ట్రాలకు అధికం కావచ్చు. మరికొన్ని రాష్ట్రాలకు తగ్గనూవచ్చు.
- రాష్ట్రాలపై ప్రభావం ఉంటుంది కావున కనీసం 2/3వ వంతు రాష్ట్రాల ఆమోదం కావాలి.
- అవిశ్వాస తీర్మానంతోపాటు, విశ్వాస తీర్మానం కూడా(ప్రత్యామ్నాయ ప్రభుత్వాన్ని ఎన్నుకుంటూ) ఏకకాలంలో ఆమోదించేటప్పుడు ఉంటేనే జమిలి విధానం సాధ్యం.

(మిగతా రేపటి దిక్సూచిలో)

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

ఎలక్షన్ కమిషన్ అభిప్రాయం

జమిలి ఎన్నికలకు పెద్దఎత్తున ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు, ఓటరు వెరిఫైయబుల్ పేపర్ ఆడిట్ ట్రైల్(వీవీపీఏటీ) అవసరమవుతాయి. ప్రస్తుతం ఉన్నవాటికి అదనంగా రెండింతలు, మొత్తంగా 30 లక్షల ఈవీఎంఎస్, వీవీపీఏటీలు అవసరమవుతాయని పేర్కొంది.

అయితే జమిలి ఎన్నికలు నిర్వహించేందుకు తాము సిద్ధమేనని, ఇది ఎలక్షన్ కమిషన్‌పై గణనీయంగా భారం తగ్గిస్తుందని 2022లోనే ప్రధాన ఎలక్షన్ కమిషనర్ సుశీల్‌చంద్ర సంసిద్ధత వ్యక్తం చేశారు. నిజానికి 1983లోనే ఎలక్షన్ కమిషన్ జమిలి ఎన్నికల ప్రస్తావన తెచ్చింది. కానీ అప్పటి ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేయలేదు.

ఈ జమిలి విధానం గతంలో భారతదేశ స్వాతంత్ర్యానంతరం జరిగిన నాలుగు వరుస సార్వత్రిక ఎన్నికల్లో(1952, 1957, 1962, 1967ల్లో) పాటించారు. కారణం, అప్పటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తికాలంపాటు కొనసాగడం. కానీ, 1957లో కేరళలో అధికారంలోకి వచ్చిన వామపక్ష ప్రభుతాన్ని, ప్రకరణ 356ను ప్రయోగించి కేంద్రప్రభుత్వం రద్దు చేసి రాష్ట్రపతి పాలన విధించింది. 1960లో తిరిగి కేరళ అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించారు. దీనితో కేంద్ర, రాష్ట్రాల్లో ఒకేసారి ఎన్నికలు నిర్వహించే విధానానికి గండిపడింది. 1967 ఎన్నికల్లో చాలా రాష్ట్రాల్లో(బిహార్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, పంజాబ్, పశ్చిమబెంగాల్, ఒరిస్సా) కాంగ్రెసేతర ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. అయితే వాటిలో చాలావరకూ పూర్తికాలం కొనసాగకుండానే రద్దవడంతో 1967 తరవాత జమిలి ఎన్నికలు సాధ్యపడలేదు.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

రాష్ట్రాన్ని ఆదుకునే ఎన్నారైలపై ఇంత అక్కసా?

▸▸ కోమటి జయరామ్



అమరావతి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఆపద సమయాల్లో ఆపన్న హస్తం అందించే ఎన్నారైలపై వైసీపీ నాయకులు తీవ్ర విమర్శలు చేయడం, బెదిరింపులకు పాల్పడటం అత్యంత దారుణమని ప్రముఖ ప్రవాసాంధ్రుడు, ఎన్నారై టీడీపీ అమెరికా కోఆర్డినేటర్ కోమటి జయరామ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ప్రవాస భారతీయులు ఎన్నికల సమయంలో వచ్చి గ్రామాల్లో గొడవలు సృష్టిస్తే మాత్రం.. వారు ఏ దేశాల నుంచి వచ్చారో తిరిగి అక్కడికి వెళ్లడానికి వీల్లేకుండా చేస్తాం' అంటూ బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి వరకూటి అశోక్‌బాబు చేసిన బెదిరింపు వ్యాఖ్యలను ఆయన ఖండించారు. ఏపీకి అన్ని విధాలా సాయం చేస్తున్న ఎన్నారైలను ఇలాంటి వ్యాఖ్యలతో అవమానిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి బెదిరింపులకు పాల్పడుతున్న అశోక్‌బాబుపై ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏ దేశమేగినా ఎందు కాలిడినా పొగడరా నీజాతి నిండు గౌరవమూ అన్న గురజాడ స్ఫూర్తిని అణువణువునా నింపుకొన్న ప్రవాసాంధ్రులు విభజిత ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి తమ వంతు కర్తవ్యంగా అనేక కార్యక్రమాలు చేస్తున్నారని, నిధులు ఇస్తున్నారని, పాఠశాలలను దత్తత తీసుకుంటున్నారని తెలిపారు. పల్లెల్లో వైద్య, ఆరోగ్య సేవలను మెరుగుపరుస్తున్నారని, పన్నులు కూడా కడుతున్నారని పేర్కొన్నారు. పరిశ్రమల స్థాపన ద్వారా రాష్ట్రంలోని నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారని, విద్యను అందిస్తున్నారని తెలిపారు. కరోనా సమయంలో ప్రభుత్వానికి సమాంతరంగా అనేక కార్యక్రమాలు చేపట్టి రోగులను ఆదుకున్నారని వివరించారు.

రేపు తిరుమలలో వీఐపీ బ్రేక్ దర్శనం రద్దు


తిరుమల, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో మంగళవారం శ్రీవారి వీఐపీ బ్రేక్ దర్శనాలను టీటీడీ రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ నెల తొమ్మిదో తేదీన ఉగాది ఆస్థానం సందర్భంగా మంగళవారం శ్రీవారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం (ఆలయ శుద్ధి) నిర్వహించనున్నారు. ఉదయం 6 నుంచి 11 గంటల వరకు ఈ కార్యక్రమం జరగనుండటంతో వీఐపీ బ్రేక్‌ను టీటీడీ రద్దు చేసింది. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఇప్పటికే ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలను రద్దు చేసిన విషయం తెలిసిందే. ప్రొటోకాల్ పరిధిలో స్వయంగా వచ్చే వీఐపీలకు, ట్రస్టు దాతలకు మాత్రమే బ్రేక్ దర్శన టికెట్లను జారీ చేస్తున్నారు. కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నేపథ్యంలో వీటిని కూడా రద్దు చేస్తున్నట్టు టీటీడీ తెలిపింది.

15 రోజుల్లో శ్రీవాణి ట్రస్టుకు 22.75 కోట్లు

ఎన్నికల కోడ్ నేపథ్యంలో తిరుమల శ్రీవారి శ్రీవాణి ట్రస్టుకు గడిచిన 15 రోజుల్లో రూ.22.75 కోట్ల విరాళాలు అందాయి. ఎన్నికల కోడ్ కారణంగా మార్చి 16వ తేదీ నుంచి వీఐపీ బ్రేక్ సిఫారసు లేఖలను టీటీడీ రద్దు చేసింది. ఈ క్రమంలో శ్రీవాణి ట్రస్టుకు రూ.10 వేల విరాళం అందించి రూ.500 బ్రేక్ దర్శన టికెట్లను కొనుగోలు చేసే వారి సంఖ్య పెరిగింది. తిరుమలలో ఇచ్చే ఆఫ్‌లైన్ కోటా కూడా పెంచి కౌంటర్లను రెండు నుంచి నాలుగుకు పెంచారు. దీంతో 15 రోజుల్లో 22,752 శ్రీవాణి టికెట్లను కొనుగోలు చేయగా, రూ.22.75 కోట్లు ట్రస్టుకు జమయ్యాయి.

సైబర్ బానిసలు!
కంబోడియాలో దుర్భర స్థితిలో 5000 మంది భారతీయులు

న్యూఢిల్లీ, మార్చి 31: "మీ పేరు మీద విదేశాల నుంచి ఒక పార్శిల్ వచ్చింది. దానికి ఆ పన్నులు కట్టాలి.. ఈ పన్నులు కట్టాలి" అంటూ రూ.లక్షల్లో, రూ.కోట్లల్లో దోచుకునే సైబర్ స్కామ్‌ల గురించి వినే ఉంటారు! ఈ తరహా సైబర్ కుంభకోణాల బాధితులైతే.. తమకు కాల్ చేసి బెదిరించినవారిని దారుణంగా తిట్టుకుంటారు. కానీ.. ఈ దందాలో భాగస్వాములై అమాయకులకు కాల్ చేస్తున్నవారిలోనూ కొందరు బాధితులు ఉంటారని తెలుసా? కంబోడియా కేంద్రంగా సాగుతున్న ఈ తరహా సైబర్ ఫ్రాడ్ ఇందుకు నిదర్శనం. కేవలం ఈ ఫ్రాడ్ చేయడం కోసమే.. ఉద్యోగావకాశాల పేరుతో భారతీయులకు ఎర వేసి, వారిని అక్కడికి తరలించి.. వారితో సైబర్ ఫ్రాడ్‌లు చేయిస్తూ.. చేయనంటే కరెంటు షాకులతో దారుణంగా హింసిస్తున్న దందా ఇది. దాదాపు 5000 మంది భారతీయులు ఈ మాఫియా చేతికి చిక్కి.. రోజుకు 12 గంటలకు పైగా పనిచేస్తూ దుర్భరపరిస్థితుల్లో జీవితం గడుపుతున్నట్టు కంబోడియాలోని భారతీయ రాయబార కార్యాలయానికి ఇటీవలికాలంలో ఫిర్యాదులు అందాయి. దీంతో.. అక్కడున్న మనవారిని కాపాడి, ఇక్కడికి తీసుకొచ్చేందుకు కంబోడియా, భారతదేశ ప్రభుత్వాలు ఉమ్మడి ఆపరేషన్ చేపట్టాయి. ఈ విషయాన్ని మన విదేశాంగ శాఖ ఒక ప్రకటన ద్వారా వెల్లడించింది. "ఉద్యోగావకాశాల పేరుతో తమను ప్రలోభపెట్టి.. తీరా కంబోడియాకు తీసుకొచ్చాక సైబర్ నేరాలు చేయాలంటూ తమపై ఒత్తిడి తెస్తున్నారంటూ బాధితులు కంబోడియాలోని మా రాయబార కార్యాలయానికి ఫిర్యాదు చేశారు. మీడియా కథనాల ద్వారా కూడా కంబోడియాలోని భారతీయుల దుస్థితి గురించి మా దృష్టికి వచ్చింది." అని విదేశాంగ శాఖ ఆ ప్రకటనలో వివరించింది. ఇప్పటిదాకా ఆ మాఫియా నుంచి 250 మంది భారతీయులను కాపాడి, మనదేశానికి తరలించినట్టు వెల్లడించింది. ఉద్యోగాల కోసం కంబోడియాకు వెళ్లి సైబర్ మాఫియా వలకు చిక్కిన మనోళ్ల పని.. అక్కణ్నుంచీ ఇక్కడికి ఫోన్ చేసి భారతీయులను మోసగించడమే. "మీకు ఫలానా దేశం నుంచి ఒక పార్శిల్ వచ్చింది. దాంట్లో మాదక ద్రవ్యాలు ఉన్నాయి (లేదా) అనుమానాస్పద వస్తువులు ఉన్నాయి. ఈడీ/ సీబీఐ/ఐటీ అధికారులు మీ మీద నిఘా పెట్టారు. మీరు అర్జెంటుగా జరిమానా/పన్ను చెల్లించాలి. అలా చెల్లించకపోతే అధికారులు మిమ్మల్ని అరెస్ట్ చేస్తారు" అంటూ బెదిరించడమే. ఆ బెదిరింపులకు భయపడిన చాలా మంది.. వారు అడిగిన డబ్బులు చెల్లిస్తున్నట్టు నిత్యం వార్తల్లో చూస్తూనే ఉన్నాం. ఇలా ఆ ముఠా.. గడిచిన ఆరు నెలల వ్యవధిలోనే మన భారతీయులను మనపైనే ప్రయోగించి అక్షరాలా 500 కోట్ల రూపాయలను అన్యాయంగా కాజేసినట్టు వెల్లడైంది.



మోసం ఇలా..

భారత ప్రభుత్వం ఈ ముఠా నుంచి కాపాడినవారిలో స్టీఫెన్ అనే వ్యక్తి ఉన్నాడు. ఈ దందా ఎలా జరుగుతోందో అతడు వివరంగా అధికారులకు తెలిపాడు. "నేను ఐటీఐ చేశాను. కరోనా సమయంలో ఉద్యోగాన్వేషణలో ఉంటే మంగళూరు నుంచి ఒక ఏజెంట్ నన్ను సంప్రదించాడు. కంబోడియాలో డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగం ఉందని చెప్పాడు. సరేనన్నాను. నాతో పాటు.. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బాబూరావు అనే వ్యక్తిని కూడా కంబోడియాకు తీసుకెళ్లాడా ఏజెంటు. ఎయిర్‌పోర్టులో ఇమిగ్రేషన్ సమయంలో.. మేం ముగ్గురం టూరిస్టు వీసా మీద వెళ్తున్నట్టు చెప్పాడు. అప్పుడే నాకు అనుమానం వచ్చింది. కానీ ఏమీ అనలేదు. కంబోడియాకు చేరుకున్నాక మమ్మల్ని ఒక ఆఫీసుకు తీసుకెళ్లాడు. అక్కడ మమ్మల్ని ఇంటర్వ్యూ చేశారు. అక్కడి బాస్ ఒక చైనీయుడు. వారు మా టైపింగ్ స్పీడ్‌ను పరీక్షించారు. కానీ.. మా ఉద్యోగం డేటా ఎంట్రీ కాదని.. నిత్యం ఫేస్‌బుక్ ప్రొఫైల్స్ చెక్ చేసి.. సైబర్ ఫ్రాడ్‌లకు లొంగిపోయే బలహీన మనస్తత్వం ఉన్నవారెవరో గుర్తించడమే మా ఉద్యోగమని ఆ తర్వాత తెలిసింది. మేం మహిళల పేరుతో, ఫొటోలతో ఫేక్ సోషల్ మీడియా ఖాతాలను తెరవాలి. డేటింగ్ యాప్స్ ద్వారా.. బలహీనులకు వలవేయాలి. వారు మా వలలో పడ్డాక క్రిప్టో కరెన్సీ ట్రేడింగ్ పేరుతోనో, వారి పేరు మీద ఇండియాకి ఏవో వస్తువులను పంపిస్తున్నామనో ముగ్గులోకి లాగాలి. ఆ తర్వాత మరి కొందరు రంగంలోకి దిగుతారు. వలలో పడ్డవారికి దర్యాప్తు ఏజెన్సీ అధికారుల పేర్లతో ఫోన్లు చేసి డబ్బులు పిండుతారు. ఈ దందా చేసేదంతా చైనీయులే" అని స్టీఫెన్ వివరించాడు. తమకు రోజువారీ లక్ష్యాలు విధిస్తారని.. ఆ లక్ష్యాలను అందుకోలేకపోతే శిక్ష విధిస్తారని.. టార్గెట్ సాధించేదాకా తిండి పెట్టకుండా, తమ గదికి వెళ్లి విశ్రాంతి తీసుకోనివ్వకుండా హింసిస్తారని వాపోయాడు. కంబోడియాకు వెళ్లి ఉద్యోగంలో చేరగానే వారి పాస్‌పోర్టులను సైబర్ ఫ్రాడ్ ముఠా తీసేసుకోవడంతో.. వారు అక్కణ్నుంచీ బయటపడడం కష్టమవుతోందని ఒడిశా పోలీసులు వివరించారు. సైబర్ నేరగాళ్లు చెప్పిన పని చేయడానికి మనవాళ్లు నిరాకరిస్తే వారిపై దాడి చేయడం, కరెంటు షాకులివ్వడం వంటి దారుణాలకు పాల్పడుతున్నారని.. వారిని ఒంటరిగా గదుల్లో బంధిస్తున్నారని ఈ కేసును దర్యాప్తు చేసిన ఒడిశా పోలీసు అధికారి ఉపాసన తెలిపారు. అక్కడ ఇలా చిక్కుకున్న భారతీయుల వివరాలను గుర్తించి వారిని వెనక్కి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని ఆమె వివరించారు.

బాధితుడి ఫిర్యాదుతో..

కేంద్ర ప్రభుత్వ సీనియర్ ఉద్యోగి ఒకరు గత ఏడాది ఈ మాఫియా బారిన పడి రూ.67 లక్షలు పోగొట్టుకున్నారు. ఆయన ఫిర్యాదు మేరకు ఈ కేసును దర్యాప్తు చేసిన ఒడిశా పోలీసులు.. ఈ దందా అంతా కంబోడియా నుంచి జరుగుతున్నట్టు గుర్తించారు. ఉద్యోగాల పేరుతో ఇక్కణ్నుంచీ అక్కడికి మనోళ్లను తరలిస్తున్న ఎనిమిది మందిని గత ఏడాది డిసెంబరు 30న అరెస్టు చేశారు. ఆ ఎనిమిది మందీ ఒకే ప్రాంతానికి చెందినవారు కాదు. వారంతా దేశంలోని వేర్వేరు ప్రాంతాలకు చెందినవారు కావడం గమనార్హం. వారిచ్చిన సమాచారం ఆధారంగా ఒడిశా పోలీసులు మరో 16 మందిపై లుకౌట్ నోటీసులు జారీ చేశారు. ఆ లుకౌట్ నోటీసుల ఆధారంగా ఇమ్మిగ్రేషన్ బ్యూరో అధికారులు.. కంబోడియా నుంచి హైదరాబాద్‌కు చేరుకున్న హరీశ్ కూరపాటి, నాగవెంకట సౌజన్య కూరపాటి అనే ఇద్దరిని ఎయిర్‌పోర్టులో అదుపులోకి తీసుకున్నారు.

కడప తహశీల్దార్ శివప్రసాద్ అరెస్టు
14 రోజుల రిమాండ్

తిరుపతి క్రైం, మార్చి 31: ఆదాయానికి మించి దాదాపు రూ.70 కోట్ల చర, స్థిరాస్తులు కూడబెట్టిన కేసులో కడప తహశీల్దార్ సిద్దాల శివప్రసాద్‌ను విజయవాడ సెంట్రల్ ఇన్వెస్టిగేషన్ అధికారులు ఆదివారం అరెస్టు చేశారని ఏసీబీ ఏఎస్పీ సౌమ్యలత తెలిపారు. ఆయనకు నెల్లూరు ఏసీబీ కోర్టు 14 రోజుల పాటు రిమాండ్ విధించిందని తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తహశీల్దారుగా పనిచేసిన శివప్రసాద్ అనతికాలంలోనే కోట్లకు అధిపతిగా ఎదిగారు. తిరుపతి, రేణిగుంట, కడప ప్రాంతాల్లో కోట్లాది రూపాయల విలువ చేసే భూములు, మాల్స్, ప్లాట్స్, భవనాలు, అపార్టుమెంట్లు సమకూర్చుకున్నారు. దీనిపై ఫిర్యాదులు అందడంతో విజయవాడ అవినీతి నిరోధక శాఖలోని సెంట్రల్ ఇన్వెస్టిగేషన్ బృందం శనివారం రంగంలోకి దిగింది. పీలేరు, తిరుపతి, రేణిగుంట, బంగారుపాళెం, కడప ప్రాంతాల్లో సోదాలు చేశారు. ఈ సోదాల్లో దాదాపు రూ.70 కోట్ల స్థిర, చరాస్తులు ఉన్నట్టు గుర్తించారు. తాజాగా.. రాష్ట్రంలోని అన్ని జాతీయ బ్యాంకులకు ఏసీబీ అధికారులు లేఖలు రాశారు. శివప్రసాద్, ఆయన భార్య మాధవి, బంధువులు, బినామీ పేర్లతో ఎక్కడైనా అకౌంట్లు ఉంటే వెంటనే లావాదేవీలు ఆపి.. ఖాతాలను సీజ్ చేయాలని ఆ లేఖలో పేర్కొన్నారు. అలాగే సోమవారం నుంచి బ్యాంకు లాకర్లు పరిశీలించడానికి ఏసీబీ అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే తహసీల్దార్‌కి సంబంధించిన బినామీల జాబితాను తెప్పించుకున్న ఏసీబీ అధికారులు తనిఖీలు చేయడానికి చర్యలు చేపట్టారు.




ప్రచార రథంపై ప్రభుత్వ సలహాదారు కర్నాటి ప్రభాకర్‌రెడ్డి, వైసీపీ నేతల బైక్ ర్యాలీలో పాల్గొన్న ఫీల్డ్ అసిస్టెంట్ (సర్కిల్‌లో)

కోడ్ ఉన్నా.. డోంట్‌కేర్!

▸▸ వైసీపీ ప్రచారంలో ప్రభుత్వ సలహాదారు
▸▸ మారని కొంతమంది ఉద్యోగుల తీరు
▸▸ రాజీనామా చేసి రావాలని వలంటీర్లపై ఒత్తిడి
▸▸ సాయిరెడ్డి ర్యాలీలో ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్

వరికుంటపాడు/ఉదయగిరి రూరల్/బిట్రగుంట(దగదర్తి), మార్చి 31: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా కొంతమంది ప్రభుత్వ ఉద్యోగులు ఇప్పటికీ వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటూనే ఉన్నారు. ఇలాంటివారిపై ఫిర్యాదులు అందిన వెంటనే ఎన్నికల సంఘం అధికారులు చర్యలు తీసుకుని, విధుల నుంచి సస్పెండ్ చేస్తున్నా ఉద్యోగుల్లో మాత్రం ఎలాంటి మార్పు కనిపించడం లేదు. ఆదివారం నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి వరికుంటపాడు మండలంలో 'విజయసంకల్ప యాత్ర' పేరుతో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. దీనిలో పలువురు ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు. అలాగే ఏపీ రైతు సాధికారిత సంస్థ ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు కర్నాటి ప్రభాకర్‌రెడ్డి ఏకంగా ప్రభుత్వం కేటాయించిన వాహనం ఎక్కి దారి పొడవునా ర్యాలీలో పాల్గొన్నారు. అలాగే, వింజమూరు మండలం నందిగుంట ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు జక్కం మోహన్‌రెడ్డి సైతం ప్రచారంలో పాల్గొన్నారు. ఇటీవల నిబంధనలు ఉల్లంఘించిన తూర్పుకొండారెడ్డిపల్లి ఫీల్డ్ అసిస్టెంట్ చెంచురెడ్డిని విధుల నుంచి తొలగించినా ఆయన ఏమాత్రం భయం లేకుండా మళ్లీ ప్రచారంలో పాల్గొన్నారు.

వలంటీర్లపై ఒత్తిడి

రాజీనామా చేసి వైసీపీ ప్రచారంలో పాల్గొనాలని అధికార పార్టీ నేతలు గ్రామ/వార్డు వలంటీర్లపై ఒత్తిడి తెస్తున్నారు. వైసీపీ మరోసారి అధికారంలోకి రాగానే మీరే వలంటీర్లుగా ఉంటారని వారికి భరోసా ఇస్తున్నారు. అయినప్పటికీ కొందరు వలంటీర్లు జంకుతున్నారు. కాగా, నెల్లూరు జిల్లా దగదర్తి మండలంలో ఆదివారం వైసీపీ నేతల ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీలో రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు, విజయసాయిరెడ్డి పాల్గొన్నారు. వారి వెనుకే వెలుపోడు పంచాయతీ కామినేనిపాలెం ప్రాంతానికి చెందిన ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ కామినేని నాగరాజు కూడా పాల్గొన్నారు. ఈ విషయాన్ని కొందరు స్థానికులు మండల, డివిజన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

భర్త మర్మాంగంపై మరిగే నీళ్లు..!

▸▸ కుటుంబ కలహాలతో హత్యాయత్నం చేసిన భార్య

వినుకొండటౌన్, మార్చి 31: నిద్రిస్తున్న భర్త మర్మాంగంపై సలసల మరిగే నీటిని పోసి భార్య హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన పల్నాడు జిల్లా వినుకొండలో ఆదివారం తెల్లవారుజామున జరిగింది. బాధితుడి కథనం మేరకు ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం గ్రామానికి చెందిన నాయిని ప్రభుదాస్, అతని భార్య అనూష గత కొన్ని రోజులుగా వినుకొండ పట్టణంలోని హనుమాన్ నగర్ 13వ లైన్‌లో నివాసం ఉంటున్నారు. కుటుంబ కలహాలతో కొంతకాలంగా వేర్వేరుగా జీవనం సాగిస్తున్నారు. పెద్ద మనుషులు సర్దిచెప్పి కాపురానికి పంపించారు. వారంరోజుల క్రితం కాపురానికి వచ్చిన భార్య ఆమె తల్లిదండ్రులతో కలిసి సలసల మరిగే నీరు పోసి హత్యాయత్నానికి పాల్పడినట్టు ప్రభుదాస్ తెలిపాడు. తీవ్రంగా గాయపడిన బాధితుడిని ప్రైవేట్ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.



బిల్డ్ అమరావతి అంటూ వెంకటపాలెం ధర్నా శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు

అమరావతిని నాశనం చేస్తే అధోగతే

● 1566వ రోజుకు చేరుకున్న రైతుల ఆందోళనలు

తుళ్ళూరు, మార్చి 31: భూమి పుత్రులను అన్యాయం చేసిన వారు మంట గలసిపోవటమేనని రాజధాని అమరావతికి 33వేల ఎకరాలు త్యాగం చేసి రైతులు పేర్కొన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు మహిళలు చేస్తున్న ఆందోళనలు ఆదివారం నాటికి 1566వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాలు, ఇళ్ల వద్ద నుంచి వారు మాట్లాడారు. అమరావతిని నాశనం చేసిన వైసీపీ నేతలు ఈ ఎన్నికల్లో అధోగతి పాలుగాక తప్పదన్నారు. కేవలం అమరావతిని నిర్వీర్యం చేయటం కోసమే మూడు ముక్కలాట అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీని అప్పులకుప్పగా చేసి సంక్షేమం చేశామని చెప్పటం విడ్డూరంగా ఉందన్నారు. అమరావతి అభివృద్ధితోనే రాష్ట్ర క్షేమం ముడిపడి ఉందన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాల్లో రైతుల ఆందోళనలు కొనసాగాయి.

మహిళ మృతదేహం కలకలం

● డంపింగ్ యార్డులో కాలిపోయి కనిపించిన దృశ్యం



క్లూస్‌టీంతో మహిళ మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

తెనాలి రూరల్, మార్చి 31: అగ్నికి ఆహుతై మాంసపు ముద్దగా పడి ఉన్న మహిళ మృతదేహం సంగంజాగర్లమూడిలో కలకలం రేకెత్తించింది. తెనాలి - గుంటూరు ప్రధాన రహదారి వెంట ఉన్న సంగంజాగర్లమూడి కొమ్ముమూరు కాలువ కట్ట సమీపంలో శ్మశానవాటిక ఉంది. దానిని ఆనుకుని పంచాయతీ డంపింగ్ యార్డు నిర్వహిస్తుంది. ఎప్పటిలాగే పంచాయతీ పారిశుధ్య కార్మికులు ఆదివారం ఉదయం గ్రామంలో సేకరించిన చెత్తను తీసుకువచ్చి డంపింగ్ యార్డులో పోసేందుకు వచ్చారు. అదే సమయంలో అగ్నికి ఆహుతై బోర్లగా పడి సుమారుగా 20 నుండి 30 ఏళ్ల వయస్సు మధ్యలో ఉన్న మహిళ మృతదేహాన్ని చూసి భయాందోళనకు గురయ్యారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. రూరల్ పోలీసులు ఘటనాస్థలానికి మహిళ మృతదేహాన్ని పరిశీలించారు. మహిళ మృత దేహమేనా లేక ట్రాన్స్‌జెండర్ అయి ఉంటారా అన్న విషయాలను ఆరా తీశారు. ఆమె ఎరుపు రంగు పంజాబీ డ్రస్ ధరించి ఉందని, సన్నగా ఉండి ఎత్తు సుమారుగా 4.5 అడుగులు ఉండవచ్చన్నారు. ఆనవాళ్ల ప్రకారం ఎవ్వరైనా గుర్తిస్తే రూరల్ సీఐ ఫోన్ 9440796219, ఎస్ఐ ఫోన్: 9440796170లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

సంగం డెయిరీపై అసత్య ప్రచారాలు తగదు

పొన్నూరుటౌన్ (చేబ్రోలు), మార్చి31: పాడి రైతుల అభివృద్ధి సంక్షేమం తప్ప మరో అజెండా లేకుండా పనిచేస్తున్న సంగం డెయిరీపై అసత్య ప్రచారాలు మానుకోవాలని ఆ సంస్థ పీఆర్‌వో కె.శ్రీనివాస్ ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. సంగం డెయిరీలో జరిగిన పాలకవర్గ సమావేశం సందర్భంగా మీడియా ప్రతినిధులకు తయిలాలు పంచారు అంటూ అసత్య కథనాలు ప్రచురించటం తమకు బాధను కలిగిస్తుందన్నారు. దక్షిణ భారతదేశంలోనే ప్రముఖ సహకార డెయిరీగా ఉన్న సంస్థ ప్రతిష్ఠను దిగజార్చేందుకు ఎంతో మంది ప్రయత్నించి విఫలమయ్యారన్నారు. ఇలాంటి కార్యక్రమాలను సంగం డెయిరీ ఏనాడు ప్రోత్సహించదని శ్రీనివాస్ తెలిపారు.

మంగళగిరికి మహర్దశ కల్పిస్తా

● దేశంలోనే ప్రత్యేకంగా అభివృద్ధి చేస్తా ● టీడీపీ అభ్యర్థి నారా లోకేశ్

మంగళగిరి, మార్చి 31: దేశంలో సుమారుగా వున్న నాలుగువేల అసెంబ్లీ నియోజకవర్గాల్లో మంగళగిరి నియోజకవర్గం అభివృద్ధిలో ప్రత్యేకంగా కనిపించేలా చేయడమే లక్ష్యంగా తాను కృషి చేస్తానని మంగళగిరి టీడీపీ అభ్యర్థి నారా లోకేశ్ అన్నారు. ఆయన ఆదివారం నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించారు. సాయంకాలం మంగళగిరిలోని టిడ్కో కాలనీతోపాటు తాడేపల్లి మహానాడు ఏరియాలో రచ్చబండ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ఎన్నికల సందర్భంగా టిడ్కో లబ్ధిదారులకు ఇచ్చిన అన్నీ హామీలను జగన్ ప్రభుత్వం గాలికొదిలేసిందన్నారు. దురదృష్టవశాత్తూ జగన్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో టిడ్కో కాలనీల్లో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయన్నారు. రెండు నెలల్లో రాబోయే ప్రజాప్రభుత్వం టిడ్కో కాలనీల్లో పూర్తిస్థాయి మౌలిక సదుపాయాలను కల్పించి కాలనీవాసులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తుందన్నారు. గత ఐదేళ్లుగా తాను నియోజకవర్గంలో పేదల సంక్షేమం కోసం ఎంతగానో శ్రమించి 29 రకాల సంక్షేమ కార్యక్రమాలను చిత్తశుద్ధితో నిర్వహిస్తున్నట్టు చెప్పారు. గత 25 ఏళ్లుగా ఇక్కడ అధికారంలో కొనసాగుతూ వచ్చిన మురుగుడు హనుమంతరావు కుటుంబం కానీ ఆళ్ల రామకృష్ణారెడ్డి కానీ తాను చేసినదాంట్లో కనీసం పదోవంతు సేవలను కూడ ప్రజలకు అందించలేకపోయారన్నారు. టిడ్కో రుణాలను మాఫీ చేయాలన్న అంశమై చంద్రబాబుతో చర్చించి తగునిర్ణయం తీసుకుంటామన్నారు.

కాగా, టిడ్కో కాలనీలో పూర్తిస్థాయి నీటి వసతిని కల్పించాలని, కుటీర పరిశ్రమలను ఏర్పాటుచేయించి ఉపాధి కల్పన చేయాలని, కాలనీలో పరిశుభ్రతకు ప్రాధాన్యం కల్పించి సత్వర చర్యలు చేపట్టాలని, గృహ సముదాయాల్లో వున్న పైప్‌లైన్ లీకేజీలతో పాటు ఇతర మరమ్మతులను జరిపించాలని, ఇసుక అందుబాటు ధరల్లో అందరికీ అందుబాటులో వుండేవిధంగా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు లోకేశ్‌కు విజ్ఞప్తిచేశారు. ఈ విజ్ఞప్తులపై లోకేశ్ స్పందిస్తూ టిడ్కోకాలనీలో వున్న అన్నీ సమస్యలను ప్రజాప్రభుత్వం వచ్చిన రెండు మాసాల్లోగా పరిష్కరిస్తామని, డీఎస్సీ నోటిఫికేషన్‌తో పాటు ఏటా జాబ్ కేలండర్‌ను ఇస్తామని, మెరుగైన ఇసుక పాలసీతో ఇసుకను అందరికీ అందుబాటులోకి తీసుకొస్తామని, ఆర్థికంగా వెనుకబడిన వారికి ఈబీసి రిజర్వేషన్లను కల్పిస్తామని హామీలను ఇచ్చారు.

తాడేపల్లి మహానాడు ఏరియాలో జరిగిన రచ్చబండలో స్థానికులు గంజాయి ఉధృతిని గురించి లోకేశ్‌కు ఫిర్యాదుచేశారు. కోతలు లేకుండా పథకాలు సజావుగా తమకు అందేలా చూడాలని, తమ ప్రాంతంలో పాఠశాల, కళాశాల, ఆసుపత్రిని ఏర్పాటుచేయించాలని కోరారు. ఈ విజ్ఞప్తులపై లోకేశ్ స్పందిస్తూ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే గంజాయికి చెక్ పెడతామన్నారు. తాడేపల్ల కరకట్ట వెంట రిటైనింగ్ వాల్‌ను నిర్మించడంతోపాటు భూగర్భ డ్రైనేజీ, రోడ్లు, తాగునీటి సౌకర్యం కల్పిస్తామన్నారు. దీర్ఘకాలంగా ఇదేప్రాంతంలో నివశిస్తున్నవారికి శాశ్వత హక్కును కల్పిస్తూ నివేశన పట్టాలను పంపిణీ చేయిస్తామని లోకేశ్ వారికి హామీలను ఇచ్చారు.



మంగళగిరి టిడ్కో కాలనీలో ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తున్న నారా లోకేశ్

ఈ కార్యక్రమాల్లో టీడీపీ నేతలు పోతినేని శ్రీనివాసరావు, నందం అబద్ధయ్య, దామర్ల రాజు, గోవాడ దుర్గారావు, షేక్ రియాజ్, పడవల మహేశ్, తమ్మిశెట్టి జానకీదేవి, మన్నెం రమేష్‌బాబు, జవ్వాది కిరణ్‌చంద్, మాదల రమేష్, కనికళ్ల చిరంజీవి, తాడేపల్లి టీడీపి నేతలు వల్లభనేని వెంకట్రావు, చిన్నపోతుల సుబ్బారావు, అద్దంకి మురళీ, దానబోయిన సుందరరావుయాదవ్, ఇట్టా పెంచలయ్య, ఇట్టా భాస్కర్, జనసేన నేతలు చిల్లపల్లి శ్రీనివాసరావు, మునగపాటి వెంకట మారుతీరావు, తిరుమలశెట్టి కొండలరావు, సామల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పల్నాడులో వైసీపీకి ఎదురుదెబ్బ

● చంద్రబాబుని కలిసిన ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి ● త్వరలో లోకేశ్ సభలో టీడీపీలోకి జంగా



చంద్రబాబుకు బొకే అందజేస్తున్న జంగా, పక్కన ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, యరపతినేని తదితరులు

పిడుగురాళ్ల మార్చి 31: పల్నాడు జిల్లాలో వైసీపీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి ఆ పార్టీని వీడి టీడీపీలో చేరారు. నరసరావుపేట పార్లమెంటు కూటమి అభ్యర్థి లావు శ్రీ కృష్ణదేవరాయలు, గురజాల నియోజకవర్గ అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావులతో కలసి జంగా కృష్ణమూర్తి ఆదివారం బాపట్ల జిల్లా ప్రజాగళం యాత్రలో టీడీపీ అధినేత చంద్రబాబును కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఏప్రిల్ మొదటి వారంలో పల్నాడుజిల్లా గురజాలలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పాల్గొనే 'శంఖారావం' సభలో ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి టీడీపీ తీర్థం పుచ్చుకోనున్నట్లు నేతలు తెలిపారు. ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తితో పాటు మరికొందరు వైసీపీ నేతలు టీడీపీలో చేరనున్నారు. చంద్రబాబును కలిసిన వారిలో డాక్టర్ ఉన్నం నాగమల్లికార్జునరావు, కంచేటి శివ, జంగా కృష్ణమూర్తి తనయుడు, పిడుగురాళ్ల జడ్పీటీసీ కోటయ్య, మాజీ జడ్పీటీసీ భూషణం చెన్నయ్య, దాచేపల్లి నగర పంచాయతీ (స్వతంత్ర) కౌన్సిలర్ షరీఫ్, మాశెట్టి పుల్లారావు, బుజ్జి, మరికొందరు నాయకులు ఉన్నారు.

కోడ్ ఉన్నా.. అదే తీరు

● వైసీపీ అభ్యర్థులు యథేచ్ఛగా నిబంధనల ఉల్లంఘన
● ఈస్టర్ వేడుకల్లో ఎన్నికల ప్రచారం

పొన్నూరుటౌన్, మార్చి31: ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తూ ఆలయ ప్రాంగణంలో ప్రచారం నిర్వహించారు. ఈస్టర్‌ను పురస్కరించుకుని పాతపొన్నూరులోని క్రీస్తు శతవార్షిక లూథరన్ దేవాలయంలో వేలాది మంది భక్తులు ప్రత్యేక ప్రార్థనలకు హాజరయ్యారు. ఈస్టర్ శుభాకాంక్షలు తెలిపేందుకు గుంటూరు పార్లమెంట్ వైసీపీ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య, పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ స్థానిక వైసీపీ నాయకులతో కలిసి చర్చికి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో తమను గెలిపించాలని కోరారు. నిబంధనల మేరకు ప్రార్థన స్థలాల్లో ప్రచారం చేయకూడదు. కానీ వారు లెక్క చేయలేదు. చర్చిల్లో ఎన్నికల ప్రచారాన్ని చేయకూడదనే నిబంధనను తప్పకుండా అమలు చేయాలని క్రైస్తవ సంఘాల నాయకులు కోరుతున్నారు.

అధికారుల ఉదాశీన వైఖరి

పొన్నూరు నియోజకవర్గంలో ఎన్నికల అధికారుల ఉదాశీన వైఖరిపై ప్రజల నుంచి పెద్దఎత్తున విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. వైసీపీ అభ్యర్థి అంబటి మురళీకృష్ణ నియోకవర్గంలోని చేబ్రోలు, పెదకాకాని మండలాలోని వలంటీర్లతో సమావేశం ఏర్పాటు చేసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. దీనిపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదుల వెల్లడటంతో చేబ్రోలులో 75 మందిని, పెదకాకానిలో 17 మందిని విధుల నుంచి తప్పించారు. అలాగే వారం క్రితం ములుకుదరు గ్రామంలో పర్యటించిన అంబటి మురళీకృష్ణ సీఎంఆర్‌ఎఫ్ చెక్ పంపిణీ చేయటం వివాదస్పదమైంది. ఇటీవల చేబ్రోలులో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇఫ్తార్ విందు నిర్వహించి నిబంధనలను ఉల్లంఘించటమే కాకుండా వైసీపీ అభ్యర్థి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఉల్లంఘనలపై ఎన్నికల అధికారిణి ఎ.లక్ష్మీకుమారిని వివరణ కోరగా తమకు వచ్చిన సమాచారం మేరకు వివరణ ఇవ్వాలని వైసీపీ అభ్యర్థి అంబటి మురళీకృష్ణను ఆదేశించినట్లు చెప్పారు.

ఎమ్మెల్యే ముస్తాఫా వెంట ఉద్యోగి

గుంటూరు(కార్పొరేషన్): ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చినా జీఎంసీలో ఉద్యోగులు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. నగరపాలక సంస్థకు చెందిన ఎలక్ట్రికల్ విభాగంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి సుధీర్ ఎమ్మెల్యే ముస్తఫా వెంట ప్రచారంలో పాల్గొన్నారు. రెండు రోజుల కిందట పాత గుంటూరు క్రైస్తవుల సమాధుల తోటలో ఏర్పాట్లను పరిశీలించేందుకు ఎమ్మెల్యే ముస్తఫా వెళ్లారు. ఆయనతో పాటు సుధీర్ కూడా పాల్గొన్నారు. అయినా ఎటువంటి చర్యలు లేవు. ఎన్నికల నియమావళి వీరికి వర్తించదా అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు.



పాతగుంటూరు సమాధుల్లో ఎమ్మెల్యే ముస్తఫాతో పాటు కార్పొరేషన్ ఔట్‌సోర్సింగ్ ఉదోగి సుధీర్



పాతపొన్నూరు క్రీస్తు శతవార్షిక లూథరన్ దేవాలయంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కిలారి వెంకట రోశయ్య, అంబటి మురళీకృష్ణ

నీటి కుంటలో పడి.. ఇద్దరు విద్యార్థులు మృతి

● స్కూలు యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలంటూ..
● కుటుంబ సభ్యుల ఆందోళన



రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబసభ్యులు, బంధువులు



విద్యార్థుల మృతదేహాలు

మాచర్ల రూరల్, మార్చి 31: స్నానానికి వెళ్లి నీటి కుంటలో పడి ఇద్దరు విద్యార్థులు మృతిచెందిన ఘటన మాచర్ల పట్టణంలో ఆదివారం చోటుచేసుకుంది. పట్టణ శివారులోని శ్రీగౌతమ్ మోడల్ స్కూల్‌లో విద్యాబోధనతోపాటు హాస్టల్ కూడా నిర్వహిస్తున్నారు. మాచర్ల మండలం రేగులవరంతండాకు చెందిన రమావత్ తరుణ్‌నాయక్ (15), వంకాడవత్ హనుమంతునాయక్ (14) ఎనిమిదో తరగతి చదువుతూ హాస్టల్‌లో ఉంటున్నారు. వీరిద్దరు మధ్యాహ్న సమయంలో స్కూల్ సమీపంలోని కరుముల కృష్ణారెడ్డి పొలంలోని నీటి కుంట వద్దకు తోటి విద్యార్థులు ఐదుగురితో కలిసి స్నానం చేసేందుకు వెళ్లారు. తరుణ్‌నాయక్, హనుమంతునాయక్‌లు తమకు ఈత వచ్చంటూ కుంటలోకి దిగారు. కుంట 20 అడుగుల లోతు ఉండడంతో కుంటలోకి దిగిన వీరు మునిగిపోయారు. ఎంతసేపటికి వారివురు కుంటలో నుంచి బయటకు రాకపోవడంతో తోటి విద్యార్థులు స్కూల్‌కు వెళ్లి యాజమాన్యంకు చెప్పారు. వారు అక్కడకు చేరుకొని నీటిలో మునిగిపోయిన తరుణ్‌నాయక్, హనుమంతునాయక్‌లను బయటకు తీశారు. కాగా వారు అప్పటికే మృతిచెందారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా ప్రదేశానికి చేరుకొని మృతదేహాలను మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

బాధిత కుటుంబాలు ఆందోళన..

కాగా విషయం తెలుసుకున్న బాధిత కుటుంబసభ్యులు, బంధువులు సంఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. తమ కుమారుల మృతదేహాలను చూసి బోరున విలపించారు. తమ పిల్లల మరణానికి స్కూల్ యజమాన్యమే కారణమని ఆవేదన వ్యక్తం చేశారు. స్కూల్‌కు వెళ్లి ఆఫీస్‌లో ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. స్కూల్ ఎదుట మాచర్ల- గుంటూరు ప్రధాన రహదారిపై బైఠాయించి గంటపాటు ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న సీఐలు శరత్‌బాబు, సురేష్‌లు అక్కడకు చేరుకున్నారు. ఆందోళనకారులకు సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. స్కూల్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆందోళనకారులు కోరారు. విచారణ జరిపి న్యాయం జరిగేలా చూస్తామని హామీనివ్వడంతో వారంతా అక్కడినుంచి వెళ్లిపోయారు.

పోలీసుల వాహనంపై రాళ్లు

కాగా పోలీసులు తమకు సహకరించడం లేదని పోలీసుల వాహనంపై బాధిత కుటుంబసభ్యులు, బంధువులు రాళ్లు రువ్వారు. దీంతో పోలీసు వాహనం అద్దాలు పగిలాయి. పోలీసులు చూస్తుండగానే వాహనం అద్దాలను ధ్వంసం చేశారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని టీడీపీ కార్యకర్త మృతి



కుంచాల వెంకటరత్నం మృతదేహం

బాపట్ల, మార్చి 31: బాపట్ల అంబేద్కర్ సర్కిల్‌లో ఆదివారం రాత్రి ప్రజాగళం సభకు వచ్చి తిరిగి వెళుతున్న టీడీపీ కార్యకర్తను ఆర్టీసీ బస్సు ఢీకొట్టటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే అప్పికట్ల గ్రామానికి చెందిన కుంచాల వెంకటరత్నం ప్రజాగళం సభకు వచ్చి ఆలస్యమౌతుందని తిరిగి వెళుతుండగా గుంటూరు ఫ్లైఓవర్ వద్ద జీబీసీరోడ్డుపై బస్సు ఢీకొట్టటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన గురించి తెలుసుకున్న తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు మృతుని కుటుంబానికి సంతాపం ప్రకటించి అన్నివిధాలా ఆదుకుంటామని హామీనిచ్చారు. ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ ఆ కుటుంబాన్ని పరామర్శించి రావాలని చంద్రబాబు వేదికపై తెలిపారు.

నూర్పిడి యంత్రంలో పడి యువకుడి మృతి

కాకుమాను, మార్చి 31: శనగ నూర్పిడి యంత్రంలో పడి యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని వల్లూరులో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ రవీంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. వట్టిచెరుకూరు మండలం కారంపూడిపాడు గ్రామానికి చెందిన తోటకూర లక్ష్మీనరసింహనాయుడు(20) మరికొంత మంది కూలీలు వల్లూరు గ్రామంల శనగ నూర్పిడి పనులకు వచ్చారు. శనగ పైరును యంత్రంలో వేసే క్రమంలో ప్రమాదవశాత్తు నూర్పిడి యంత్రంలో పడి మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడి తండ్రి సుబ్బారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవీంద్ర తెలిపారు.

బీసీలకు అండగా ఉంది టీడీపీనే

● వడ్డెరల ఆత్మీయ సమావేశంలో శ్రీకృష్ణదేవరాయలు



మాచర్లలో వడ్డెర ఆత్మీయ సమ్మేళనంలో శ్రీకృష్ణ దేవరాయలు, బ్రహ్మారెడ్డి

మాచర్లటౌన్, మార్చి 31: బీసీ అంటే టీడీపీ.. టీడీపీ అంటే బీసీ అని, గడిచిన కాలాన్ని చూస్తే బీసీలకు అండగా ఉంది టీడీపీనే అని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి కూటమి నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థి లావు శ్రీకృష్ణ దేవరాయలు అన్నారు. ఆదివారం పట్టణంలో జరిగిన నియోజకవర్గ వడ్డెరల ఆత్మీయ సమావేశంలో ఆయన ఉమ్మడి కూటమి మాచర్ల నియోజకవర్గ అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డితో కలిసి పాల్గొన్నారు. శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ బీసీ కార్పొరేషన్లకు తగిన నిధులు సమకూరుస్తామన్నారు. చేతివృత్తిదారులకు మేలు కలిగేలా సబ్సిడీ కల్పిస్తామన్నారు. పనిముట్లు, మిషనరీ కొనుగోలు చేసేవరకు వెసులుబాటు కల్పిస్తామన్నారు. వడ్డెర సామాజికవర్గ అభ్యున్నతికి కట్టుబడి ఉంటామని, కమ్యూనిటీ హాలు, శ్మశానవాటికల నిర్మాణానికి నిధులు సమకూరుస్తామన్నారు. నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థియైన తనను, మాచర్ల నియోజకవర్గ అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. ఆదివారం దుర్గిలోని సత్యసాయి కల్యాణ మండపంలో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

వడ్డెరలను అరాచక శక్తులుగా చూపుతున్నారు : బ్రహ్మారెడ్డి

వడ్డెర సంఘీయులను అరాచక శక్తులుగా స్థానిక ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డిలు చూపుతున్నారని ఉమ్మడి నియోజకవర్గ అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. నిత్యం కష్టించి శ్రమిస్తే వడ్డెరలకు తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రాధాన్యతనిస్తామన్నారు. రిజర్వేషన్లు పునరుద్ధరిస్తామన్నారు. రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా చేయూతనిస్తామన్నారు. బీసీ చట్టాన్ని అమలు చేసి సామాజిక భరోసా కల్పిస్తామని బ్రహ్మారెడ్డి అన్నారు. గ్రామాల వారీగా నాయకులను పిలిచి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చంద్రబాబునాయుడు రూపొందించిన సూపర్ 6 పథకాలపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలన్నారు.

దాతల సహకారం అభినందనీయం

● కేజేఎస్ఎస్ అధ్యక్ష, కార్యదర్శులు సామినేని, చుక్కపల్లి రమేష్
● నూతన వసతిగృహానికి జనచైతన్య హౌసింగ్ తరపున రూ.20 లక్షల విరాళం



పాలకవర్గ సభ్యులకు చెక్కును అందజేస్తున్న మాదల రత్నగిరిబాబు

గుంటూరు(తూర్పు), మార్చి31: వసతి గృహానికి, నూతన భవన సముదాయానికి పేద విద్యార్థులకు ఆర్థిక తోడ్పాటును అందిస్తున్న దాతల సహకారం అభినందనీయమని కమ్మ జనసేవ సమితి అధ్యక్ష, కార్యదర్శులు సామినేని కోటేశ్వరరావు, చుక్కపల్లి రమేష్‌లు కొనియాడారు. స్థానిక జేకేసీ రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న భవన సముదాయానికి జనచైతన్య హౌసింగ్ ప్రైవేటు లిమిటెడ్ తరఫున రూ.20 లక్షల భారీ విరాళాన్ని ప్రకటించారు. ఆదివారం కుందులరోడ్డులోని కమ్మ బాలికల వసతి గృహంలో ఆ సంస్థ ప్రతినిధి మాదల రత్నగిరిబాబు పాలకవర్గ సభ్యులకు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా రత్నగిరిబాబు మాట్లాడుతూ బాలిక విద్యను ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఈ విరాళాన్ని అందజేసినట్టు తెలిపారు. సామినేని కోటేశ్వరరావు, చుక్కపల్లి రమేష్‌లు మాట్లాడుతూ జనచైతన్య హౌసింగ్ వారు గతంలో రూ.30 లక్షలు అందజేశారని, మరో సారి రూ.20లక్షలు ఇవ్వడం, నూతన భవన నిర్మాణానికి అవసరమైతే స్థలం కూడా ఇస్తామని చెప్పడం అభినందనీయమన్నారు. కాకాని రోడ్డులో ఏర్పాటు చేసిన శంకర్ కంటి ఆస్పత్రికి స్థలం జనచైతన్య వారు ఇచ్చారని గుర్తుచేశారు. కార్యక్రమంలో మాదల చైతన్య, ప్రముఖ కార్డియాలజిస్ట్ పాటిబండ్ల శివాజీ, డాక్టర్ పూజ, సమితి ఉపాధ్యక్షులు వడ్లమూడి నాగేంద్రం, సంయుక్త కార్యదర్శి గుంటుపల్లి కోటేశ్వరరావు, గౌరవ సలహాదారు కన్నెగంటి బుచ్చయ్యచౌదరి, పాలక వర్గ సభ్యులు వడ్లమూడి శివరామకృష్ణయ్య, ఘంటా పున్నారావు తదితరులు పాల్గొన్నారు.

జనాభా దామాషా ప్రకారం రజకులకు టికెట్లు కేటాయించాలి

● ఏపీ రజక సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు అంజిబాబు



సమావేశంలో మాట్లాడుతున్న అంజిబాబు తదితరులు

గుంటూరు, మార్చి 31: ప్రభుత్వ నామినేటెడ్ పోస్టుల్లో రజకులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆంధ్రప్రదేశ్ రజక సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు పాతపాటి అంజిబాబు ధ్వజమెత్తారు. గుంటూరులో ఆదివారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో రాజకీయంగా రజకులకు జనాభా దామాషా ప్రకారం టికెట్లు కేటాయించటంలో తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. నామినేటెడ్ పోస్టుల్లో కూడా రజక కార్పొరేషన్ తప్పితే ఏ కార్పొరేషన్‌లో అవకాశాలు కల్పించలేదని విమర్శించారు. కొన్ని వందల సంవత్సరాల నుంచి భూముల్లో ఉన్న రజకులకు, రజక సంఘాలకు ప్రభుత్వాలు ఎందుకు శాశ్వతహక్కులు కల్పించడం లేదని ప్రశ్నించారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో ట్రస్ట్ బోర్డ్ మెంబర్‌గా రజకులకు అవకాశం కల్పించాలని కోరారు. అదేవిధంగా ప్రతి దేవాలయంలో ట్రస్ట్ బోర్డ్ సభ్యులుగా రజకులు ఉండాలని ఒక జీవో తీసుకురావాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో రజక సంఘాల నాయకులు ఉన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.03 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	130, 139,150
చికెన్ విత్ స్కిన్	248.00
చికెన్ స్కిన్ లెస్	258.00

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

ముస్లిం వర్గాలకు తెలుగుదేశంలోనే ప్రత్యేక గుర్తింపు

● మాజీ మంత్రి నక్కా ఆనందబాబు

● వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా చేరికలు

చుండూరు మార్చి 31: ముస్లిం వర్గాలకు తెలుగుదేశం పార్టీ మొదటి నుంచి ప్రత్యేక గుర్తింపునిచ్చిందని మాజీ మంత్రి నక్కా ఆనందబాబు తెలిపారు. ఆదివారం మండలంలోని మోదుకూరు నుంచి వైసీపీకి చెందిన 20 కుటుంబాలకు చెందిన ముస్లింలు గుంటూరులోని ఆనందబాబు క్యాంపు కార్యాలయంలో టీడీపీలో చేరారు. వీరికి ఆనందబాబు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆనందబాబు మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ముస్లింలకు షాదీతోఫా కింద 40వేల మందికి లబ్ధి చేకూర్చగా, జగన్ 6వేల మందికి మాత్రమే లబ్ధి చేకూర్చాని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్దలు షేక్ బాషా, బుడే మేస్త్రీ షేక్ కరిముల్లా, షేక్ మబ్బులు, అక్బర్ బాషా, షేక్ బికారి, షాన్‌ఖాన్ తదితరులతో పాటు టీడీపీ నాయకులు అన్నపురెడ్డి కృష్ణారెడ్డి, కొల్లి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

● భట్టిప్రోలు, మార్చి 31: వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు ఊపందుకున్నాయి. గొరిగపూడి గ్రామానికి చెందిన 15 వైసీపీ కుటుంబా లు గుంటూరు క్యాంపు కార్యాలయంలో ఆదివారం మాజీ మంత్రి ఆనందబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. ఆయా కుటుంబాల వారికి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గొరిగపూ డి గ్రామానికి చెందిన గ్రామ సర్పంచ్ గరికపాటి మల్లిక భర్త వెంక టేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ ధూళిపాళ్ళ వెంకట్, ధూళిపాళ్ళ అప్పా రావు, ధూళిపాళ్ళ రామకృష్ణ, ధూళిపాళ్ళ సుబ్బారావులతో పాటు 15 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరాయి. కార్యక్రమంలో గొరిగపూడికి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న మాజీ మంత్రి ఆనందబాబు

అడ్డగోలు, అబద్దాలతో బురిడీ కొట్టించే వ్యక్తి జగన్‌రెడ్డి

అమృతలూరు, మార్చి 31: అడ్డగోలు, అబద్దాలతో ప్రజలను బురిడీ కొట్టిస్తున్న పనికిమాలిన వ్యక్తి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అని నక్కా ఆనందబాబు తెలిపారు. మండల పరిధిలోని గోవాడలో తెలుగుదేశం, జనసేనపార్టీల కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆనందబాబు మాట్లాడుతూ అబద్దాలు చేప్పే వ్యక్తి జగన్ అన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో దళితవాడల్లో అభి వృద్ధి జరిగిందా, నేడు జగన్ ప్రభుత్వంలో అభివృద్ధి జరిగిందా అని ప్రశ్నించారు. ఈ విషయంలో అందరూ ఒకసారి ఆలోచించుకోవాలని సూచించారు. సమావేశంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అచ్చెన్నాయుడు మాతృమూర్తికి మాజీ మంత్రి సంతాపం

వేమూరు, మార్చి 31: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మాజీ మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు మాతృమూర్తి కళావతమ్మ మృతికి మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు నక్కా ఆనందబాబు తీవ్ర విచారాన్ని వ్యక్తం చేస్తూ సంతాపం ప్రకటించారు. అచ్చెన్నాయు డికి, కుటుంబసభ్యులకు ఆనందబాబు సానుభూతి ప్రకటించారు.

రానున్నది కూటమి ప్రభుత్వమే

● ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం కల్పిస్తాం

రేపల్లె, మార్చి 31: రానున్నది కూటమి ప్రభుత్వమేనని ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం కల్పిస్తామని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ అన్నారు. ఆదివారం 23వవార్డు కౌన్సిలర్ తులసి దుర్గాప్రసాద్ సోదరు డు సాగర్ తుమ్మల గ్రామ 8వవార్డు సభ్యులు గాదె మణీంద్ర, అరవప ల్లి శివాలయం బోర్డు సభ్యుడు ఎల్ కొండలు, 27వవార్డు మైనార్టీ నాయకులు ఎస్కే ఆరీఫ్‌లకు టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వా నించారు. ఆయన మాట్లాడుతూ ఐదేళ్ళ వైసీపీ పాలన ను రాష్ట్రం అభివృద్ధి చెందకపోగా అప్పుల ఊబిలో కూరుకుపోయి యువత ఉపాధి లేక రోడ్డున పడ్డారన్నారు. జగన్ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలకు విసికి వేసారిపోయిన ప్రజలు ఎన్డీఏ కూటమి ప్రభు త్వంలో చేరుతున్నారని ఆయన అన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీకి బుద్ధి చెప్పాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్య దర్శి గూడపాటి శ్రీనివాసరావు, బాపట్ల జిల్లా కార్యనిర్వహణ కార్యదర్శి తాతా ఏడుకొండలు, కేసన రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.




టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్

రాజకీయ లబ్ధికోసమే వైసీపీ దుష్ప్రచారానికి దిగుతుంది

రాజకీయ లబ్ధికోసమే ఎన్నికల సంఘంపై వైసీపీ దుష్ప్రచారానికి దిగుతుందని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ విమర్శించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ వలంటీర్ల ద్వారా సంక్షేమ పథకాలను పంపిణీ చేయొద్దనే ఈసీ చెప్పిందని పథకాలు ఆపమని కాదన్నారు. వాళ్ళు లేకుండా గతంలో పింఛన్లు ఇవ్వలేదా అని ప్రశ్నించారు. ఈసీ మీద వంకతో ఈనెల పంపిణీ చెయ్యకుండా వృద్ధుల నోట్లో మట్టి కొట్టాలన్నదే జగన్ కుట్ర అని ధ్వజమెత్తారు. సీఎం స్వార్థ రాజకీయాల వల్లే వీటి పంపిణీ బాధ్యతల నుంచి వలంటీర్లను ఎన్నికల కమిషన్‌ను తప్పించిందని ఆరోపించారు. కోడ్ అమల్లో ఉన్నప్పటికి ప్రభుత్వం దొడ్డిదారుల్లో అస్మదీయులకు రూ.వేల కోట్లు బిల్లులు చెల్లిం చి ఖజానా ఖాళీ చేస్తుందని, ప్రజలు వైసీపీ కుట్రలను తిప్పికొట్టి రాబోయే ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పటం ఖాయమన్నారు.

వైభవంగా ఈస్టర్ వేడుకలు

బాపట్ల, మార్చి 31 : యేరుషలేం దేశంలో కల్వరిగిరిపై సిలువలో ప్రాణత్యాగం చేసిన ఏసుక్రీస్తు మూడో రోజు మృత్యుంజయుడై లేచిన సందర్భాన్ని పురస్కరించుకొని క్రైస్తవులు ఈస్టర్ వేడుకలను ఆదివారం అత్యంత వైభవంగా జరుపుకున్నారు. క్రైస్తవుల సమాధుల తోటలను శుభ్రం చేసి రంగులతో అలంకరించి విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసి అక్కడ పెద్ద ఎత్తున ప్రార్థనలు నిర్వహించారు. కొవ్వొత్తులతో ప్రదర్శనగా సమాధుల తోటలకు వెళ్ళి అక్కడ తమ పూర్వీకులను స్మరించుకుంటూ ప్రార్థనలు చేశారు. నియోజకవర్గంలోని బాపట్ల పట్టణ, మండలంతోపాటు కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండలాలలో ఆంధ్రా ఇవాంజిలికల్ లూథరన్ సంఘాలు, సాల్వేషన్ ఆర్మీ చర్చిలతోపాటు అనేక క్రైస్తవ సంఘాల వారు ఈ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. బాపట్ల పట్టణంలోని సీబీజెడ్ చర్చిలలో నిర్వహించిన ఈస్టర్ ఆరాధనలో సంఘకాపరి ఎం.పవిత్రకుమార్ ఈస్టర్ సందేశం ఇచ్చారు. అలాగే ప్రోగ్రామ్ కమిటీ చైర్మన్ ఐ.రాజేష్, డీఎం రాహుల్‌దేవ్, టి.జాన్‌నాక్స్, జి.నాగలక్ష్మి, ఎం.జాన్సీ, పి.ప్రేమచంద్, ఆర్.విజయ్‌కుమార్, జె.క్రిష్టాఫర్, ఎస్.సత్యం, జి.పుష్పలత తదితరులు పాల్గొని వేడుకలు గురించి వివరించారు. ఎమ్మెల్యే కోన రఘుపతి తన అనుచరులతో కలిసి ఈస్టర్ ప్రార్థనలలో పాల్గొని సంఘకాపరి ఆశీర్వచనాలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో కాగిత సుధీర్‌బాబు, కొత్రా ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.



బాపట్ల సీబీజెడ్ చర్చిలో ఈస్టర్ సందేశం ఇస్తున్న ఎం.పవిత్రకుమార్, హాజరైన క్రైస్తవులు

వేమూరు, మార్చి 31 : మండల పరిధి గ్రామాల్లోని క్రైస్తవులు ఆదివారం ఈస్టర్ పండుగను ప్రత్యేక ప్రార్థనలతో నిర్వహించారు. శ్మశాన వాటికలోని సమాధుల వద్ద పాస్టర్లు మృతి చెందిన వారి పేరున ప్రార్థనలు నిర్వహించారు. శ్మశాన వాటికల ప్రాంగణాలను, సమాధులను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

● కొల్లూరు, మార్చి 31 : ఈస్టర్ పర్వదినాన్ని క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఆదివారం ఉదయం కొల్లూరుతో పా టు మండల పరిధిలోని పలు గ్రామాల్లో క్రైస్తవులు తమ పెద్ద ల సమాధులను అలంకరించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనం తరం చర్చిలలో పాస్టర్లు ఈస్టర్ ప్రాముఖ్యతను వివరించారు.

● కర్లపాలెం, మార్చి 31 : కర్లపాలెం పంచాయతీ బొద్దుకూరి మాలపల్లి లూథరన్ చర్చి ఆధ్వర్యంలో ఈస్టర్ పండుగను క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం వేకువజామున క్రైస్తవులందరు క్యాండిల్స్‌తో ప్రదర్శన నిర్వహిస్తూ క్రీస్తుభక్తిగీతాలను ఆలపిస్తూ కర్లపాలెం సెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించారు.

గడ్డి వాము దగ్ధం

కర్లపాలెం, మార్చి 31 : కర్లపాలెం పంచాయతీలోని యాదవపాలెంలో గవిని సాంబయ్య అనే రైతుకు చెందిన ఎకరం గడ్డివామి ప్రమాదవశాత్తు కాలి బూడిదైంది. చుట్టుపక్కల మంటలు వ్యాపించకుండా గ్రామస్తులు మంటలను అదుపు చేశారు.



సభలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ



ప్రజాగళం సభకు హాజరైన ప్రజానీకం

ప్రజాగళం సభకు జననీరాజనం

● చంద్రబాబుకు బ్రహ్మరథం పట్టిన ప్రజానీకం

బాపట్ల, మార్చి 31 : బాపట్ల పట్టణంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన ప్రజాగళం రోడ్‌షోకు ప్రజలు నీరాజనం పలికారు. బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల హెలీప్యాడ్ దగ్గర నుంచి అంబేద్కర్ సర్కిల్‌లో సభ జరిగే ప్రాంగణం వరకు చంద్రబాబుకు అడుగడుగున ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ప్రజలకు అభివాదం చేస్తూ చంద్రబాబునాయుడు సభాప్రాంగణానికి చేరుకున్నారు. కార్యక్రమం అనుకున్న సమయం కన్న కొంత ఆలస్యమైనప్పటికీ ప్రజలు చెక్కు చెదరని అభిమానంతో కిక్కిరిసిపోయారు. చంద్రబాబును చూచి ఒక్కసారిగా ఉప్పొంగిపోయి కేరింతలు కొట్టారు. ఐదేళ్ళ వైసీపీపాలనలో జరిగిన అవినీతి, అక్రమాలు ప్రజాసమస్యలపై చంద్రబాబు ప్రసంగించిన ప్రతి అంశానికి ప్రజలు కేరింతలు కొట్టారు.

చంద్రబాబు బాటలో పయనిస్తా : ఎంపీ అభ్యర్థి తెన్నేటి

విజన్ ఉన్న చంద్రబాబునాయుడు నాయకత్వంలో, ఆయన బాటలో పయనిస్తానని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి బాపట్ల ఎంపీ అభ్యర్థి తెన్నెటి కృష్ణప్రసాద్ స్పష్టం చేశారు. ప్రజాగళం వేదికపై నుండి ప్రజలను ఉద్దేశించి కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ ఎంపీగా గెలిపిస్తే పార్లమెంట్‌లో ప్రజావాణిని వినిపించి రాష్ట్రానికి కావాల్సిన అన్నివనరులు సమకూర్చేవిధంగా చంద్రబాబునాయకత్వంలో పని చేస్తానన్నారు. బాపట్ల ప్రజలు ఎంతో పౌరుషంగా ఉన్నారని తెలుగుదేశం విజయం కోసం ఎదురుచూస్తున్నారని ఆయన అన్నారు. వైసీపీ పాలనలో అనేక కుటుంబాలు ఆత్మహత్యలు చేసుకున్నాయని భూములు మార్పిడి చేస్తూ ప్రజలను ఇబ్బంది పెడుతున్నారన్నారు. విశాఖపట్టణంలో డ్రగ్స్ కంటైనర్ వచ్చిందని నాసిరకం మద్యం విక్రయిస్తూ అనేక మంది మృతికి కారకులవుతున్నారన్నారు. వారికి తగిన గుణపాఠం చెప్పి తెలుగుదేశం అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

అవినీతిలేని పాలన అందిస్తాం : వేగేశన

బాపట్ల ఎమ్మెల్యేగా తనను గెలిపిస్తే అవినీతి లేని పాలన ప్రజలకు అందిస్తానని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ స్పష్టం చేశారు. ప్రజాగళం సభలో ఆయన మాట్లాడుతూ సేవ చేసే బాధ్యత చంద్రబాబు తనకు ఇచ్చారన్నారు. నాలుగుసార్లుగా ఓటమీ పాలైన తెలుగుదేశంపార్టీ జెండా ఈసారి ఎగురవేయాలని పిలుపునిచ్చారు. వైసీపీ మూకలు తనపై సోషల్‌మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. 10 సంవత్సరాలుగా 3వేల మందికి ఉద్యోగం, 10 వేల మందికి ఉపాధి కల్పిస్తుంటే కార్మికుల జీతం కోసం బ్యాంక్ నుంచి తీసుకొచ్చిన రూ.56 లక్షలు పట్టుకొని ఐటి అధికారులకు అప్పగించటంపై చేసే విమర్శలు సరికాదన్నారు. రెండుమూడు రోజులలో ఆ డబ్బు తీసుకొచ్చి కార్మికులకు వేతనాలందిస్తామని చెప్పారు.

చంద్రబాబుకు ఘన స్వాగతం

బాపట్ల, మార్చి 31 : ప్రజాగళం కార్యక్రమానికి బాపట్ల విచ్చేసిన తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఘనస్వాగతం లభించింది. బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ, ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణ ప్రసాద్, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు, చీరాల ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎం కొండయ్య, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్, రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్, సంతనూతలపాడు ఎమ్మెల్యే అభ్యర్థి విజయ్‌కుమార్, బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు ముప్పలనేని శ్రీనివాసరావు, మానం నాగేశ్వరరావు, దొప్పలపూడి రామ్మోహనరావు, బీజేపీ నాయకులు బి.కృష్ణ చైతన్య తదితరులు చంద్రబాబుకు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. కళాశాల దగ్గర నుంచి రోడ్‌షో నిర్వహిస్తూ చంద్రబాబు పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్‌లో జరిగిన ప్రజాగళం సభలో పాల్గొని ప్రసంగించారు.



చంద్రబాబుకు స్వాగతం పలికేందుకు హెలిప్యాడ్ వద్ద వేచి ఉన్న నేతలు

సుబ్రహ్మణ్యం సేవలు అభినందనీయం : ఎస్పీ

బాపట్ల, మార్చి 31 : ఏపీఎస్పీ కానిస్టేబుల్‌గా పోలీసుశాఖలో ప్రవేశించి నాలుగు దశాబ్దాలపాటు వివిధ విభాగాలలో విశేష సేవలందించిన ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ కేవీ సుబ్రహ్మణ్యం సేవలు అభినందనీయమని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. ఉద్యోగవిరమణ పొందిన సుబ్రహ్మణ్యంను జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ వకుల్ జిందాల్ ఆదివారం ఘనంగా సత్కరించి సన్మానించారు. కార్యక్రమంలో వెల్ఫేర్ ఆర్ఐ డి.శ్రీనివాసరెడ్డి, అడ్మిన్ ఆర్ఐ షేక్ మౌలుద్దీన్, కానిస్టేబుల్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పది మూల్యాంకనానికి సర్వం సిద్ధం

● నేటి నుంచి మున్సిపల్ హైస్కూల్‌లో పది మూల్యాంకనం

బాపట్ల టౌన్, మార్చి 31 : పది మూల్యాంకనానికి బాపట్లలో మున్సిపల్ హైస్కూల్ సర్వం సిద్ధమైంది. క్యాంప్ ఆఫీసర్ కె.నారాయణరావు ఆదివారం మాట్లాడుతూ జిల్లాలో వివిధ ఉన్నత పాఠశాలలు నుంచి అసిస్టెంట్ ఎగ్జామినర్‌లు 494, చీఫ్ ఎగ్జామినర్‌లు 84, స్పెషల్ అసిస్టెంట్‌లు 170, అసిస్టెంట్ క్యాంప్ ఆఫీసర్‌లు 11 మంది హాజరుకానున్నట్లు తెలిపారు. మూల్యాంకన కేంద్రానికి లక్షా65 వేల పేపర్లు వచ్చాయని, ఈనెల ఒకటి నుంచి 8వ తేదీ వరకు మూల్యాంకనం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ క్యాంప్ ఆఫీసర్ జి.వెంకటేశ్వర్లు, ఎంఇవో-2 ప్రసాదరావులు పాల్గొన్నారు.

120 మందికి వైద్యసేవలు

కర్లపాలెం, మార్చి 31 : కర్లపాలెంలోని శ్రీపెద్దింటమ్మతల్లి కల్యాణ ప్రాంగణంలో ఆదివారం రెడ్డి సేవామిత్ర ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని నంగు గోవర్ధనరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించగా యూనియన్ హాస్పటల్ డాక్టర్ ఎస్.మహేంద్రరెడ్డి, ఎన్ఆర్ఐ హాస్పటల్ మాజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ బి.తనుజలు 120 మంది రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చీరాల గోవర్ధనరెడ్డి, గాదె మధుసూదనరెడ్డి, న్యాయవాది కళ్ళం హరినాధరెడ్డి, మోదుగుల బసవపున్నారెడ్డి, పిట్ల శ్రీనివాసరెడ్డి, దేగల రవిరెడ్డి, జడ్పీటీసీ పిట్ల వేణుగోపాలరెడ్డి, నందు గోవర్ధనరెడ్డి, పులుగు లక్ష్మారెడ్డి, ఆట్ల హరిబాబురెడ్డి, శంకరరెడ్డి, చీరాల శ్రీనివాసరెడ్డి, ఆట్ల అయ్యప్పరెడ్డి, పిట్టు నాగాంజనేయరెడ్డి, పిట్ల వసంతరెడ్డి, బన్నారావూరి సత్యనారాయణ, అక్కల రమణారెడ్డి, మొహిద్దీన్ బేగ్, మస్తాన్ బేగ్ పాల్గొనగా ఎన్‌సీసీ విద్యార్థులు 30 మందిసేవలందించారు.

వలంటీర్ల నుంచి ఫోన్లు, వేలిముద్ర పరికరాలు స్వాధీనం

కొల్లూరు, మార్చి 31: ఎన్నికల కమిషన్ ఆదేశాలతో వలంటీర్ల నుంచి ఫోన్లు, వేలిముద్ర పరికరాలు సచివాలయ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం కొల్లూరులోని మూడు సచివాలయాల పరిధిలో ఉన్న 74మంది వలంటీర్లు తమ వద్ద ఉన్న ఫోన్లు, వేలిముద్ర పరికరాలను సాయంత్రం లోగా సచివాలయాల్లో అందజేయాలని పంచాయతీ కార్యదర్శి బి.మల్లికార్జున వారికి సూచించారు. దీంతో మూడు సచివాలయాల పరిధిలో ఉన్న 74 మందిలో 67 మంది వేలిముద్ర పరికరాలతోపాటు ఫోన్లను కార్యదర్శికి అందజేశారు. వారిలో నలుగురు తమ ఫోన్లు పోయాయని వాటి గురించి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేశారని చెప్పడంతో వారి నుంచి లిఖిత పూర్వక పత్రాలను తీసుకున్నారు. మండల పరిధిలోని ఈపూరు, గాజుల్లంక, పెసర్లంక, పోతార్లంక కార్యదర్శులు కూడా కొద్ది మొత్తంలో ఫోన్లు, వేలిముద్రల పరికరాలను సేకరించి మిగిలినవి సోమవారం ఉదయం 11గంటల లోపు అప్పగిస్తామని చెప్పారని ఎంపీడీవో తెలిపారు.

బీసీలను రాజకీయంగా ప్రోత్సహించింది ఎన్టీఆర్

● బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు మల్లికార్జునరావు

భట్టిప్రోలు, మార్చి 31: నందమూరి తారకరామారావు టీడీపీ ని స్థాపించి అనేక మంది బీసీలను రాజకీయ నాయకులుగా తీర్చిదిద్దారని నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు బట్టు మల్లికార్జునరావు అన్నారు. బీసీ డిక్లరేషన్ ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేస్తూ స్థానిక కార్యాలయంలో ఆదివారం సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ బీసీ డిక్లరేషన్‌లో బీసీలపై జరుగుతున్న దాడులను అరికట్టే ఉద్దేశంతో బీసీ రక్షణ చట్టం తీసుకురావడం స్వాగతిస్తున్నామన్నారు. బీసీ డిక్లరేషన్‌లోని అంశాలను బీసీ కుటుంబాలకు చేరే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మల్లికార్జునరావు కోరారు. కార్యక్రమంలో బీసీ సెల్ రాష్ట్ర నాయకుడు రాయన ప్రసాద్, మండల కన్వీనర్ వాకా శేషబాబు, వామనపల్లి కోటేశ్వరరావు, గొట్టుముక్కల లెనిన్ పాల్గొన్నారు.

గడ్డి ట్రాక్టరు ట్రక్కు బోల్తా

కొల్లూరు, మార్చి 31 : భట్టిప్రోలు మండలం వెల్లటూరులో రైతుల నుంచి కొనుగోలు చేసిన పశుగ్రాసాన్ని ట్రాక్టర్‌లో తీసుకువస్తుండగా దోనేపూడి వద్ద కరకట్టపై వెళ్లే క్రమంలో రేపల్లె బ్యాంకు కెనాల్ బ్రిడ్జి సమీపంలో రహదారి దెబ్బతినడంతో ట్రాక్టర్ ట్రక్కు ఒక వైపునకు ఒరిగి పడిపోయింది. ఈ ప్రమాదంలో ఎవరూ గాయపడలేదు.

చదలవాడలో వీర మహిళల ఎన్నికల ప్రచారం

వేమూరు, మార్చి 31: మండలంలోని చదలవాడ గ్రామంలో ఆదివారం జనసేన పార్టీ వీర మహిళలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామ పార్టీ అధ్యక్షురాలు బొల్లిముంత విజయలక్ష్మీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఇంటింటికి తిరిగి జనసేన తెలుగుదేశం పార్టీల ఉమ్మడి అభ్యర్థి నక్కా ఆనందబాబును గెలిపించేందుకు సైకిల్ గుర్తుపై ఓటు వేయాలని కోరా రు. చంద్రబాబునాయుడు విడుదల చేసిన ఆరు అంశాలతో కూడిన మ్యానిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త ఊసా రాజేష్ పర్యవేక్షణలో గ్రా మగ్రామాన వీర మహిళల ఆనందబాబు గెలుపు కోసం ప్రచారం కొనసాగిస్తున్నారని విజయలక్ష్మి పేర్కొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలి : రేపల్లె ఏడీ

భట్టిప్రోలు, మార్చి 31: వేసవిలో విద్యుత్ వాడకాన్ని దృష్టిలో ఉంచుకుని వినియోగానికి అనుగుణంగా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని విద్యుత్‌శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి.శ్రీనివాస్ చెప్పారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ ఇటీవల భట్టిప్రోలు సబ్‌స్టేషన్ పరిధిలో సంకటివారివీధి శివాల యం వద్ద గల ట్రాన్స్‌ఫార్మర్ నెలకొన్న సాంకేతిక లోపం కారణంగా లోడ్‌పడడంతో రెండు ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతినడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అలాంటి పరిస్థితులు తలెత్తకుండా ముందస్తుగా ట్రాన్స్‌ఫార్మర్లు అందుబాటులోకి ఉంచుకోవాలని, అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను వినియోగదారులకు అందించాలని సిబ్బందిని ఏడీ శ్రీనివాస్ ఆదేశించారు.

ప్రజాగళం బహిరంగ సభకు భారీగా తరలివెళ్లిన టీడీపీ శ్రేణులు

పిట్టలవానిపాలెం, మార్చి 31 : బాపట్ల నియోజకవర్గ కూటమి అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ పిలుపు మేరకు ఆదివారం మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బాపట్లలో పాల్గొనే ప్రజా గళం బహిరంగ సభకు పిట్టలవానిపాలెం మండలం నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, తెలుగు మహిళలు అధిక సంఖ్యలో తరలివెళ్ళారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఎండీ అఫ్జల్, మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు డాక్టర్ గ్లోరియానేట్ సోపాటి ఆధ్వర్యంలో టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జిలు కనుమూరి సాంబమూర్తిరాజు, మోదుగుల శంకరరెడ్డి, జాలాది లోకరాజ్యుడు, టీడీపీ బాపట్ల పార్లమెంట్ మైనార్టీ అధ్యక్షుడు మహ్మద్ ఖాసిం, టీడీపీ బాపట్ల పార్లమెంట్ మైనార్టీ ప్రధాన కార్యదర్శి సయ్యద్ జునేద్, టీడీపీ సీనియర్ నాయకుడు లక్కంరాజు వెంకటపతిరాజు, భవనం బసివిరెడ్డి, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు గోకరాజు శ్రీధర్‌వర్మ, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి పిట్టు సాయిబాబారెడ్డి, బాపట్ల నియోజకవర్గ తెలుగుయువత కార్యదర్శి కలకోట కిషోర్‌రెడ్డి, అబ్దుల్ రహీం, సయ్యద్ నిజాం, నిజాంపట్నం నాగరాజు, మంతెన శ్రీదేవి రామకృష్ణంరాజు, కార్యకర్తలు, అభిమానులు తరలివెళ్ళారు.



ప్రజాగళం బహిరంగ సభకు బయలుదేరుతున్న పిట్టలవానిపాలెం మండల టీడీపీ శ్రేణులు

చంద్రబాబు ప్రజాగళం యాత్రకు తరలిన ప్రజలు

కర్లపాలెం, మార్చి 31 : బాపట్లలో ఆదివారం రాత్రి అంబేద్కర్ సర్కిల్‌లో నిర్వహించిన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజాగళం యాత్రకు కర్లపాలెం మండల నలుమూలల నుంచి వేలాది మంది కార్యకర్తలు, అభిమానులు ట్రాక్టర్, కార్లు, ద్విచక్రవాహనాలు, ఆటోలలో వేలాదిగా తరలివెళ్ళారు. కర్లపాలెం సెంటర్‌లో వాహనాలకు టీడీపీ, జనసేన, బీజేపీ జెండాలను వాహనాలకు కట్టి పవన్‌కళ్యాణ్, మోదీ, చంద్రబాబులకు జేజేలు పలికారు. రాబోయే ఎన్నికలలో టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపిస్తామని ధీమావ్యక్తం చేశారు.

శ్రీరామనవమి వరకు వసంత నవరాత్రులు జరుపుకోవాలి

బాపట్ల, మార్చి 31 : ప్రతి రామాలయంలో ఉగాది నుంచి శ్రీరామనవమి వరకు వసంత నవరాత్రులు జరుపుకోవాలని సమరసత సేవా ఫౌండేషన్ రాష్ట్ర కన్వీనర్ వేముల సుబ్బారావు తెలిపారు. బాపట్లలో ఆదివారం ఫౌండేషన్ జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కన్వీనర్ శ్రీనివాసుల శ్రీనివాసు అధ్యక్షత వహించగా జిల్లా మహిళా కన్వీనర్ బొలగాని విజయలక్ష్మి, సభ్యులు పొన్నపల్లి సత్యనారాయణ, పడమటి వెంకటేశ్వరరావు, బొలగాని వెంకటేశ్వర్లు, మోదడుగు సూరిబాబు, జంజనం హేమశంకరరావు, చింతల మురళీకృష్ణ, అక్కుల సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాపట్ల ప్రజలకు చంద్రబాబు వరాలు



రోడ్‌షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న చంద్రబాబు

బాపట్ల, మార్చి 31 : తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే బాపట్ల నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పించే బాధ్యత తాను తీసుకుంటానని తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు తెలిపారు. యువగళం సభలో బాపట్ల ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ బాపట్ల పట్టణాన్ని పట్టి పీడిస్తున్న డ్రైనేజి వ్యవస్థ, దోమలబెడద, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిస్తామన్నారు. పట్టణ ప్రజల అవసరం మేరకు మరొక సమ్మర్ స్టోరేజిట్యాంక్‌ను ఆధునిక పద్ధతిలో ఏర్పాటు చేసి నీరు భూమిలో ఇంకకుండా చూస్తామన్నారు. ముఖ్యంగా సూర్యలంక సముద్రతీరాన్ని టూరిజం హబ్‌గా అభివృద్ధి చేస్తామన్నారు. ఆక్వా, హార్టికల్చర్ అ భివృద్ధిని ప్రణాళిక ప్రకారం చేస్తామన్నారు. ఎమ్మెల్యే కోన రఘుపతి బాపట్లలో పెద్దఎత్తున ఇసుక మాఫియా చేస్తున్నారని విమర్శించారు. 50 అడుగుల లోతు ఇసుకను తవ్వి దందా చేయిస్తున్నారన్నారు. ఈవిధంగా ఊడ్చేయటం వల్ల భూ గర్భజలాలు అడుగంటి పోయే ప్రమాదం ఉందన్నారు. జగనన్నకాలనీల భూములు తక్కువ ధరకు కొని ఎక్కువధర తీసుకొని డబ్బులు కొట్టేశారన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు వ్యాపారం చేసుకోవాలంటే ఎకరానికి రూ.10 లక్షలు చెల్లించాల్సిందేనన్నారు. బాపట్లలో ఎమ్మెల్యే పెట్రోల్ బంకు తప్ప వేరొకరిది ఉండకూడదనే విధంగా చేస్తున్నారన్నారు. తీర ప్రాంతంలోని 4వేల ఎకరాల భూములను స్వాహా చేయాలని చూశారన్నారు. వైద్యకళాశాల భూముల విషయంలో కూడా దోపిడి చేయాలనే ప్రయత్నం చేశారన్నారు. భావన్నారాయణస్వామి దేవాలయం అభివృద్ధి పేరిట వసూళ్ళ చేసిన డబ్బులలో ఎంత ఖర్చుచేశారో తెలుసుకోవాలన్నారు. బాపట్లలో గంజాయి విక్రయాలు పెద్దఎత్తున జరుగుతున్నాయని అందులో ఎమ్మెల్యే కోన రఘుపతి వాటా ఉందా లేదా తెలుసుకోవాలన్నారు. బాపట్లప్రాంత ఓరుగంటి రెడ్ల సంక్షేమం కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఆదుకుంటామన్నారు. టీడీపీ పాలనలో ధరలు పెరగవు, దాడులు జరగవు, వనరులు దోపిడికి గురికావని చంద్రబాబు స్పష్టం చేశారు. అభివృద్ధి, సంక్షేమం సమానంగా తీసుకెళుతామన్నారు. బాపట్ల ప్రజల ఉత్సాహం చూస్తే గెలుపు మనదేనని ధీమా వ్యక్తం చేశారు. బాపట్ల ఎంపీగా తెన్నెటి కృష్ణప్రసాద్, ఎమ్మెల్యేగా నరేంద్రవర్మను గెలిపించాలని కోరారు.

ఓరుగంటి రెడ్డి సంఘం నాయకులు వినతిపత్రం అందజేత

కొత్తపాలెంలో ఓరుగంటి రెడ్డి సంఘం నాయకులు పలు సమస్యలపై చంద్రబాబు నాయుడుకు వినతిపత్రాన్ని అందజేశారు. 2024లో తెలుగుదేశం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో ఓరుగంటి రెడ్డి సంఘం కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని, ఓరుగంటి రెడ్లకు కల్యాణ మండప నిర్మాణానికి ప్రభుత్వం స్థలాన్ని కేటాయించాలని, ఉగ్రవాదుల దాడిలో వీరమరణం పొందిన ఆర్మీ ఉద్యోగి జశ్వంత్‌రెడ్డి విగ్రహాన్ని బాపట్లలో ఏర్పాటు చేయాలని చంద్రబాబుకు ఓరుగంటి రెడ్ల సంఘం నాయకులు వినతిపత్రంలో తెలియజేశారు. కార్యక్రమంలో బీజేపీ,జనసేన, టీడీపీ ఉమ్మడి ఎమ్మెల్యేఅభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ, టీడీపీ నాయకులు కావూరి శ్రీనివాసరెడ్డి, ఇనగంటి గాంధీ, అచంటి విజయ్, ఓరుగంటిరెడ్డి సంఘంనాయకులు పాల్గొన్నారు.



కర్లపాలెం మండలం నుంచి టీడీపీలో చేరిన వారితో వేగేశన నరేంద్రవర్మ

అశోక్‌బాబు బెదిరింపులకు తలొగ్గేదిలేదు

● ఎన్ఆర్ఐ టీడీపీ సభ్యులు మణికంఠ

భట్టిప్రోలు, మార్చి 31: నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి వరికూ టి అశోక్‌బాబు ఎన్ఆర్ఐలపై చేసిన బెదిరింపులకు తలొగ్గేదిలేదని రెట్టించిన ఉత్సాహంతో ప్రచారంలో పాల్గొనాలని ఎన్ఆర్ఐ టీడీపీ సభ్యుడు పమిడిముక్కల మణికంఠ పిలుపునిచ్చారు. మండలంలోని వెల్లటూరులో ఆయన మాట్లాడుతూ వైసీపీ అభ్యర్థి అశోక్‌బాబు ఎన్నికల్లో పాల్గొనే ఎన్ఆర్ఐలపై అక్రమ కేసులు పెడతానని బెదిరింపులకు పాల్పడడం సిగ్గుచేటన్నారు. బెదిరింపులకు బెదిరేదిలేదని రాజ్యాంగబద్ధంగా తమకున్న హక్కును వినియోగించుకుంటున్నామని చట్టప్రకారమే ఆనందబాబు గెలుపుకోసం ప్రచారంలో పాల్గొంటున్నామన్నారు. అశోక్‌బాబు ఎన్ఆర్ఐలపై చేసిన బెదిరింపులను వీడియో ఆధారాల తో సహా ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకువెళ్లామన్నారు.

టీడీపీ కార్యకర్తను పరామర్శించిన మైనేని

కొల్లూరు, మార్చి 31 : అనారోగ్యంతో బాధపడుతున్న టీడీపీ కార్యకర్తను మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ పరామర్శించారు. ఆదివారం మండల పరిధిలోని పెసర్లంకలోని టీడీపీ కార్యకర్త వెలివెల బసవ కోటేశ్వరరావు అనారోగ్యంతో బాధపడుతున్నట్లు సమాచారం తెలుసుకున్న మురళీకృష్ణ, టీడీపీ నాయకులు గ్రామంలోని కార్యకర్త స్వగృహానికి వెళ్లి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జనసేన ఎంపీటీసీ వెలివెల సుబ్రహ్మణ్యం, టీడీపీ నాయకులు కాసరనేని మోహన్, వెలివెల శ్రీరాములు, బుర్రి జగన్, చంటి పాల్గొన్నారు.

జూద స్థావరాలపై పోలీసుల దాడి

● 9 వాహనాలు స్వాధీనం.. అదుపులో 8 మంది జూదరులు

రేపల్లె, మార్చి 31: మండలంలోని రుద్రవరం సమీపంలో మండలస్థాయి వైసీపీ నాయకులు ఆధ్వర్యంలో జరుగుతున్న కోడిపందాల స్థావరాలపై ఆదివారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ సీఐ నజీర్‌బేగ్ మాట్లాడుతూ కోడిపందాలు నిర్వహిస్తు న్న వారి నుంచి రూ.5,500 నగదు, ఆరు కోళ్ళు, 9 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. 8మంది జూదరులను అదుపులోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేశామని తెలిపారు. పట్టణ పరిధిలో ఎవరైన పేకాట, కోడిపందాలు నిర్వహిస్తే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఆయన తెలిపారు.

2న ఆర్టీసీ ఈయూ జనరల్ బాడీ సమావేశం

రేపల్లె, మార్చి 31: ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం ఈనెల 2వతేదీ ఉదయం 11గంటలకు రామశాస్త్రి కల్యాణ మండపం నందు జరుగునని ఏఐటీయూసీ గౌరవాధ్యక్షుడు గొట్టుముక్క ల బాలాజీ తెలిపారు. ఆదివారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సమావేశంలో ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు అమరావతి జేఏసీ ప్రధాన కార్యదర్శి దామోదరరావు, జిల్లా జోన్ నాయకులు పాల్గొంటారని తెలిపారు. ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలై చర్చించి భవిష్యత్తు కార్యాచరణను రూపొందిస్తారని తెలిపారు. కార్యక్రమానికి ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు, సభ్యులు విధిగా హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

విద్యుత్ వైర్లు తలిగి వరిగడ్డి దగ్ధం

చుండూరు, మార్చి 31: విద్యుత్ వైర్లు తగలడంతో ట్రాక్టర్‌లోని వరిగడ్డి దగ్ధమైన ఘటన ఆదివారం మోదుకూరు వద్ద జరిగింది. బ్రాహ్మణ కోడూరుకు చెందిన రైతు మోదుకూరులో రెండెకరాల వరిగడ్డి కొనుగోలు చేసుకుని ట్రాక్టర్‌లో తరలిస్తుండగా విద్యుత్ వైర్లు తలగడంతో మంటలు అంటుకున్నాయి. ఇది గుర్తించిన స్థానికులు డ్రైవర్‌ను అప్రమత్తం చేయడంతో వెంటనే డ్రైవర్ ట్రక్కును పైకి లేపి గడ్డిని కిందకు జారవిడిచాడు. దీంతో ప్రమాదం తప్పింది.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గుండె వైద్య శిబిరం

బాపట్ల, మార్చి 31 : బాపట్ల రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. విజయలక్ష్మీపురంలోని రోటరీ కల్యాణ మండపంలో నిర్వహించిన ఈ శిబిరంలో రోటరీ అధ్యక్షుడు డాక్టర్ రావూరి వీర రాఘవయ్య మాట్లాడుతూ శిబిరంలో గుండెజబ్బులకు ఎంతో ఖరీదైన ఈసీజీ, ఈసీహెచ్‌వో పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ సుకుమార్, సాయి, క్యాంప్ చైర్మన్ తాళ్ళూరి మల్లికార్జునరావు, కోశాధికారి వి.శ్రీనివాసరావు, కార్యదర్శి కె.ఉపేంద్రగుప్తా, ఎం.సుధీర్‌కుమార్, బూర్లె రామ సుబ్బారావు, ఏలూరి హరిబాబు, డాక్టర్ జాగర్లమూడి లక్ష్మి, కొత్త ప్రసాద్, టీవీ సత్యనారాయణ, జిట్టా శ్రీనివాసరావు, జేవీ కృష్ణారావు, టి.సుబ్బారావుపాల్గొని రోగులకు సేవలందించారు.

ముంపు గ్రామాలపై వైసీపీ ప్రభుత్వం అలక్ష్యం

» టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పరిష్కరిస్తాం

» ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్

అద్దంకి, మార్చి 31: గుండ్లకమ్మ రిజర్వాయర్ ముంపు గ్రామాలు, పునరావాస కాలనీల సమస్యలను గత ఐదు సంవత్సరాలుగా వైసీపీ ప్రభుత్వం పూర్తిగా గాలికి వదిలి వేసిందని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ఆయన చేపట్టిన ఎన్నికల ప్రచారం 2వ రోజు ఆదివారం అద్దంకి మండలంలోని మణికేశ్వరంలో సాగింది. ముందుగా మణికేశ్వరం మల్లేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పక్కనే ఉన్న గుండ్లకమ్మ నదిని చూసి చలించిపోయారు.

ఈసందర్భంగా ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ వైసీపీ నేతలకు గుండ్లకమ్మ రిజర్వాయర్‌లో ఇసుక తవ్వకాలపై ఉన్న శ్రద్ధ వరదకు కొట్టుకుపోయిన రిజర్వాయర్ గేట్లు ఏర్పాటుపై లేదన్నారు. ఇసుక తవ్వకాల ద్వారా అక్రమార్జనకు అలవాటుపడి గేట్లు ఏర్పాటు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. నిత్యం వందలాది ట్రాక్టర్ల ఇసుకను తరలిస్తూ లక్షల రూపాయలు గడిస్తున్నారన్నారు. గత ఏడాది గుండ్లకమ్మ రిజర్వాయర్‌లో డ్రెడ్జర్ల ద్వారా ఇసుక తవ్వకాలను అడ్డుకున్న వైసీపీ నేతలు ఇప్పుడు మిన్నకుండటం దేనికి సంకేతమని చెప్పారు గుండ్లకమ్మ రిజర్వాయర్ ఆధారంగా చేపల వేట సాగించే జాలర్ల కుటుంబాలు ఉపాధి కోల్పోయారన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన రెండు నెలల వ్యవధిలోనే గుండ్లకమ్మ రిజర్వాయర్ గేట్లు ఏర్పాటుచేస్తామని చెప్పారు. ముంపు గ్రామాల సమస్యలన్నింటిని పరిష్కరిస్తామన్నారు. నాటి సామాజిక సర్వేతో పనిలేకుండా ప్రస్తుతం వివాహం జరిగి మేజర్ అయిన అన్ని కుటుంబాలకు


మణికేశ్వరంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

నివేశన స్థలాలు ఇవ్వటం జరుగుతుందన్నారు. టీడీపీ ప్రభుత్వం చేపల వేట సాగించే జాలర్లకు 90 శాతం రాయితీపై మోపెడ్‌లు, వలలు, మూడు చక్రాలు, నాలుగు చక్రాల వాహనాలు అందిస్తామని చెప్పారు. మణికేశ్వరం, కొంగపాడు, అనమనమూరులకు దశాబ్దాల నుంచి తారు రోడ్డు లేకపోవటంతో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి పంచాయతీరాజ్ శాఖ మంత్రి నారా లోకేష్ ప్రత్యేక చొరవతో తారు రోడ్డు మంజూరు చేయించినట్లు చెప్పారు. గత ప్రభుత్వ హయంలో మణికేశ్వరంలో పెద్దఎత్తున చేపట్టిన అభివృద్ధి పనులు మినహా గత ఐదు సంవత్సరాలలో వైసీపీ ప్రభుత్వం చేసింది శూన్యమన్నారు. అద్దంకి నియోజకవర్గంలో మరోసారి టీడీపీ జెండా ఎగురవేసి ఆగిపోయిన అభివృద్ధిని మరలా పూర్వ వైభవం దిశగా తీసుకుపోవాలన్నారు.

టీడీపీ అధికారంలోకి వస్తే చేపట్టే అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఎమ్మెల్యే రవికుమార్ ఇంటింటికి తిరిగి వివరించారు. వచ్చే ఎన్నికలలో అధికారపార్టీకి ప్రజలు బుద్ధి చెప్పేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ముస్లిం, ఎస్సీ, ఎస్టీ కాలనీలలో ఎమ్మెల్యే


మణికేశ్వరం ఎస్సీ కాలనీలో రవికుమార్‌కు గుమ్మడికాయతో దిష్టి తీస్తున్న మహిళలు

రవికుమార్ ఇంటింటి ప్రచారం నిర్వహించే సమయంలో అనూహ్య స్పందన వచ్చింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఎన్నికల ప్రచారంలో ముస్లిం, ఎస్సీ మహిళలు, యువకులు రవికుమార్ వెన్నంటి నడిచారు. ఎస్సీ కాలనీలలో, ముస్లింలు ఉండే ప్రాంతాలలో మహిళలు ఎమ్మెల్యే రవికుమార్‌కు గుమ్మడికాయలతో, ఎర్ర నీళ్ళతో దిష్టి తీశారు.

ఒకప్పుడు వైసీపీకి కంచుకోటగా ఉండే మణికేశ్వరంలో గత ఎన్నికల నాటికే మార్పు ప్రారంభమై టీడీపీకి స్వల్ప మెజార్టీ వచ్చింది. ఈ విడత గ్రామంలో అత్యధిక ఓట్లు ఉన్న ముస్లిం, ఎస్సీ కాలనీలలో అనూహ్య స్పందన రావటంతో టీడీపీకి మంచి మెజార్టీ వస్తుందన్న ధీమాను టీడీపీ వర్గీయులు వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల ప్రచారం లో టీడీపీ నేతలు నాగినేని రామకృష్ణ, కరి పరమేష్, పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కుందారపు రామారావు, కాకాని అశోక్, వడ్డవల్లి పూర్ణచంద్రరావు, పూనూరి నరేంద్ర, కేంద్రు వీరాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో ఈస్టర్

చినగంజాం, మార్చి 31: మండల పరిధిలోని గ్రామాల్లో క్రైస్తవులు ఈస్టర్ పర్వదినాన్ని ఆదివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అన్ని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకుని క్రైస్తవ సోదరులు వేకువ జామునే శ్మశాన వాటికలకు వెళ్లి చనిపోయిన వారి సమాధులను వివిధరకాల పూలతో అలంకరించి, కొవొత్తులు వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్థానిక అంబేద్కర్‌నగర్‌లో ని పెద్ద చర్చి వద్ద బ్రదర్ మేషక్‌బాబు ఆధ్వర్యంలో మహిళలకు పాటల పోటీలు ని ర్వహించి బహుమతులు అందజేశారు. కడవకుదురు, పెదగంజాం, చినగంజాం, సంతరావూరు, గొనసపూడి, మున్నంవారిపాలెం, రాజుబంగారుపాలెం, మూలగానివారిపాలెం, చింతగుంపల్లి తదితర గ్రామాల్లో ఈస్టర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

బల్లికురవ: మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం క్రైస్తవులు ఈస్టర్ పండగ వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. వల్లాపల్లి, బల్లికురవ, కొనిదెన, చెన్నుపల్లి, కొప్పెరపాడు, ముక్తేశ్వరం, వైదన, వెలమవారిపాలెం, మల్లాయపాలెం, ఉప్పుమాగులూరు అంబడిపూడి, తదితర గ్రామాల్లో క్రైస్తవులు ఆదివారం ఉదయం నుండే చర్చిలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సాయంత్రానికి గ్రామాలకు దగ్గరలో ఉన్న కొండ ప్రాంతానికి కుటుంబసభ్యులతో వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

పన్ను వసూళ్లలో అద్దంకి మున్సిపాలిటీ ప్రథమస్థానం

అద్దంకి, మార్చి 31: ఇంటి పన్నుల వసూళ్లలో అద్దంకి మున్సిపాలిటీ బాపట్ల జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచినట్లు కమిషనర్ సత్యనారాయణ తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.4.55 కోట్ల వసూలు లక్ష్యం కాగా ఆదివారం నాటికి రూ.3.72 కోట్లు వసూలు చేసినట్లు చెప్పారు. జిల్లాలో 81.80 శాతం వసూళ్లతో ప్రథమ స్థానంలో నిలిచినట్లు తెలిపారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

» ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

చినగంజాం, మార్చి 31: రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో ప్రగతిబాట పట్టించే సత్తా చంద్రబాబుకే ఉందని టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. ఆదివారం పెదగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని ఆవులదొడ్డికొత్తగొల్లపాలెంలో పర్యటించారు. ఈసందర్భంగా ఏలూరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలంతా చంద్రబాబు సారథ్యాన్ని కోరుకుంటున్నారని అన్నారు. శ్రీకాళహస్తి, ఎమ్మిగనూరులో నిర్వహించిన ప్రజాగళం సభలో చంద్రబాబు నాయుడు తనను తాను డ్రైవర్‌గా అభివర్ణించారని పేర్కొన్నారు. ప్రజలను రాతి యుగం నుంచి స్వర్ణయుగం వైపు నడిపించే డ్రైవర్ తాను అని చెప్పారని, ప్రజల కోసం ఆయన తీసుకున్న బాధ్యత అన్నారు. జగన్ అసమర్థ, అవినీతి పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి నిలిచిపోయిందని చెప్పారు. అన్ని రాష్ట్రాలు జెట్ స్పీడ్‌తో దూసుకుపోతుంటే మన రాష్ట్రం వెనుకబడిపోయిందన్నారు. జగన్‌రెడ్డి రివర్స్ పాలనతో ప్రజలు జీవితాలు రివర్స్ అయ్యాయని అన్నారు. మన అందరి కోసం దార్శనికుడు చంద్రబాబు నాయుడు ఉన్నారని చెప్పారు. ప్రజల బాధ్యత, యువత భవిష్యత్‌కు ఆయన హామీ ఇస్తున్నారని అన్నారు. యువత చంద్రబాబుతో కలిసి రావాలని, భవిష్యత్ ప్రయాణాన్ని టీడీపీ చూసుకుంటుందని చెప్పారు. మన సులభమైన ప్రయాణానికి చంద్రబాబే డ్రైవర్ అన్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణమే కాకుండా మిమ్మల్ని భద్రంగా, క్షేమంగా, సాధికారతి వైపు శరవేగంగా తీసుకుపోయే బాధ్యత చంద్రబాబుదేనని చెప్పారు. పర్చూరు నియోజవర్గంలో అభివృద్ధి పునఃప్రారంభిస్తామన్నారు. అన్నివర్గాల ప్రజల సంక్షేమమే తన లక్ష్యమని ఏలూరి పేర్కొన్నారు. రానున్న టీడీపీ ప్రభుత్వంలో పేదలందరికి నివేశ స్థలాలు అందించి, నియోజకవర్గంలో 25వేల మందికి ఇళ్ల నిర్మాణం చేపడతామన్నారు. రాజకీయాలకతీతంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అందించి పర్చూరును రోల్ మోడల్‌గా చేస్తామన్నారు. అన్నదాతల సంక్షేమానికి, యువతకు ఉద్యోగ ఉపాధి కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పొద వీరయ్య, వడ్లమూడి వెంకయ్య, నక్కల వీరరాఘవులు, మోటుమర్రి రామసుబ్బారావు, సందు శ్రీనివాసరావు, వడ్లమూడి సాంబశివరావు, కోమట్ల శ్రీనివాసరెడి, దండుప్రోలు తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.


ఆవులదొడ్డికొత్తగొల్లపాలెంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి


చంద్రబాబు నాయుడికి పసుపు కండువాతో స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే ఏలూరి

బాపట్లకు తరలివెళ్ళిన టీడీపీ శ్రేణులు

పర్చూరు, మార్చి 31: తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నిర్వహిస్తున్న ప్రజాగళం సభకు ఆదివారం పర్చూరు నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున ఆపార్టీ శ్రేణులు బాపట్లకు తరలివెళ్లారు. మండలంలోని నాగుల పాలెం, పర్చూరు, ఉప్పుటూరు, అడుసుమల్లి, చెరుకూరు, అన్నంబొట్లవారిపాలెం, నూతలపాడు, చెరుకూరు తదితర గ్రామాల నుంచి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక వాహనాలు ఏర్పాటుచేసుకొని చంద్రబాబు సభకు వెళ్ళారు. కారంచేడు మండలంలోని కారంచేడు, స్వర్ణ, దగ్గుపాడు, తిమిడితపాడు, ఆదిపూడి, పోతినవారిపాలెం గ్రామాల నుండి పెద్దసంఖ్యలో ప్రజాగళం సభకు వెళ్లారు.

బాపట్లతో నిర్వహించిన ప్రజాగళం సభలో పాల్గొనేందుకు వచ్చిన టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆపార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, పర్చూరు ఎమ్మెల్యే సాంబ శివరావు పసుపు కండువాతో స్వాగతం పలికి తమ విధేయతను చాటుకు న్నారు.


డేగరమూడి వెళ్లే సర్వీసు రోడ్డులో రోడ్డుపక్కన పడవేసిన ఖాళీ కొబ్బరి బోండాలు

డంపింగ్ యార్డుగా సర్వీసు రోడ్డు

» ఖాళీ బోండాలు పడవేస్తున్న వైనం

» తరచూ ప్రమాదాలు

మార్టూరు, మార్చి 31: మార్టూరు సెంటర్ నుంచి డేగరమూడి రోడ్డు వరకు వెళ్లే సర్వీసు రోడ్డులో ఖాళీ కొబ్బరి బోండాలను చిరువ్యాపారులు పడవేస్తున్నారు. మార్టూరు సెంటర్లో తోపుడు బండ్లు, దుకాణాలలో కొబ్బరి బోండాలను అమ్మకాలు చేసిన తర్వాత ఖాళీవాటిని రాత్రి సమయంలో తీసుకువచ్చి రోడ్డు పక్కన పడవేస్తున్నారు. వాటిని రోడ్డుకు దూరంగా కాకుండా రోడ్డుపక్కనే పడవేస్తున్నారు. కొంతమంది అయితే రోడ్డు పైనే వదిలివేసి వెళుతున్నారు. ఈ మార్గంలో వచ్చే వాహనదారులు రోడ్డుపై ఉన్న ఖాళీ కొబ్బరిబోండాలతో ప్రమాదాలకు గురవుతున్నారు.

ఆదివారం ఉదయం మార్టూరుకు చెందిన యువకుడు ద్విచక్రవాహనంపై వస్తూ రోడ్డుపై ఉన్న కొబ్బరి బోండాపై బైక్ టైరు ఎక్కడంతో పడిపోవడంతో గాయపడ్డాడు. పంచాయతీవారు గ్రామానికి దూరంగా ఖాళీ కొబ్బరిబోండాలను పడవేసేవిధంగా వ్యాపారులకు అవగాహన కలిగించాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం అక్కడ ఉన్న ఖాళీ కొబ్బరి బోండాలను తొలగించి రోడ్డుపై పడినవాటిని తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

చందలూరు పంచాయతీకి విద్యుత్ నిలిపివేత

» ప్రజావసరాలకు అంతరాయం ఏర్పడిందని సర్పంచ్ ఆవేదన

పంగులూరు, మార్చి 31: మండలంలోని చందలూరు గ్రామ పంచాయతీకి ఆదివారం విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. ఈ పంచాయతీ సుమారు రూ.కోటి పది లక్షల వరకు బకాయి ఉంది. గ్రామ పంచాయతీకి విడుదలైన 15వ ఆర్థిక సంఘం నిధులలో 20 శాతం విద్యుత్ బకాయిలకు తక్షణమే నిధులు చెల్లిస్తామని అధికారులకు చెప్పినా, సరఫరా నిలిపివేశారని సర్పంచ్ పెంట్యాల కృష్ణారావు ఆవేదన వ్యక్తం చేశారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.13 లక్షలు మంజూరయ్యాయని చెప్పారు. వీటిలో 20 శాతం విద్యుత్ బకాయిలను చెల్లించాలని ఈవోఆర్డీకి, పంచాయతీకి ఆదేశాలు జారీ చేశారు. దాంతో బకాయిలను చెల్లిస్తామని సర్పంచ్ విద్యుత్ అధికారులకు తెలిపారు.

సాంకేతికంగా ఇబ్బందులు ఉన్నందున రెండు మూడు రోజులలో బకాయిలను చెల్లిస్తామని చెప్పినా విద్యుత్ అధికారులు సరఫరాను నిలిపి వేశారని సర్పంచ్ ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ సరఫరాను తొలగించడంతో గ్రామంలో ఆర్వో ప్లాంట్ ద్వారా ప్రజలకు తాగునీటిని అందించలేకపోతున్నామని చెప్పారు. గ్రామంలో 250కు పైగా వీధిలైట్లు ఉన్నాయని, ప్రజావసరాలకు తీవ్ర అంతరాయం కలుగుతుందని చెప్పినా విద్యుత్ సరఫరాను తొలగించడం అన్యాయమని సర్పంచ్ ఆవేదన వ్యక్తం చేశారు.

బకాయిలు ఉన్న పంచాయతీలకు సరఫరా నిలిపివేశాం

- పూరిమెట్ల ఆంజనేయులు, ఏఈ

మండలంలో విద్యుత్ బకాయిలు ఉన్న అన్ని గ్రామ పంచాయతీలకు సరఫరా నిలిపివేశాం. ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు విద్యుత్ సరఫరాను తొలగించాం. బకాయిలు చెల్లించిన వెంటనే సరఫరాను పునరుద్ధరిస్తాం

సమష్టిగా పనిచేద్దాం.. విజయం సాధిద్దాం

» కూటమి అభ్యర్థి ఎంఎం కొండయ్య

చీరాల, మార్చి 31: సమష్టిగా పనిచేద్దాం.. విజయం సాధిద్దాం అని కూటమి అభ్యర్థి ఎంఎం కొండయ్య అన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి కొండయ్యను స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం పలువురు కాపు, బలిజ శ్రేణులు కాపు నాయకుడు తరణి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో కలిశారు. కొండయ్య గెలుపులో కీలక భూమిక పోషిస్తామంటూ మద్దతు పలికారు. ఈసందర్భంగా కొండయ్య మాట్లాడుతూ కూటమి పార్టీలన్నీ ఐకమత్యంతో ముందుకు సాగుదామన్నారు. అందుకనుగుణంగా సమిష్టిగా కలసి చేద్దామని చెప్పారు. చిన్నచిన్న పొరపాట్లు ఉన్నా పరస్పర అవగాహన, సహకారంతో వాటిని అధిగమించి ముందుకు సాగాలని చెప్పారు. స్థానికంగా తన గెలుపు, రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి గెలుపు, చంద్రబాబు తిరిగి ముఖ్యమంత్రి కావాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందన్నారు. అదే నినాదంతో శ్రేణులు, భావసారూప్యం ఉన్న అందరితో మమేకం కావాలన్నారు. కార్యక్రమంలో వి.భాగ్యలక్ష్మి, ఆర్కే నాయుడు, ఆలా శ్రీధర్, తోట రాజ్‌కుమార్, కందుల నాగరాజు, యలవర్తి లోకేష్, సుబ్రమణ్యం, నారిన విష్ణువర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ అనుబంధ విభాగ ప్రతినిధులు నాశిజీ, కరీమూన్‌లు కొండయ్యను కలిసి మద్దతు తెలిపారు. పలుప్రాంతాలకు చెందిన విభిన్న ప్రతిభావంతులు కొండయ్య కు మద్దతు తెలుపుతూ ఎన్నికల ప్రచారంలో తమవంతు కృషి చేస్తామన్నారు.


కూటమి అభ్యర్థి కొండయ్యకు మద్దతు తెలుపుతున్న శ్రేణులు

వేటపాలెం మండలం దేశాయిపేట ఐటీఐ కాలనీలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో కొండయ్య మాట్లాడుతూ ఆరోగ్యకర సమాజం, భవిష్యత్ తరాలకు మంచి జరగాలంటే చంద్రబాబును తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాగా, బాపట్లలో ఆదివారం జరిగిన టీడీపీ అధినేత ప్రజాగళం సభకు చీరాల నుంచి టీడీపీ శ్రేణులు పెద్దసంఖ్యలో తరలివెళ్లారు. వారితో పాటు జనసేన, బీజేపీ నాయకులు గణనీయంగా వెళ్లారు. ఎవరికి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేశారు.

ముంచుకొస్తున్న తాగునీటి ఎద్దడి

» మంచినీటి చెరువుల్లో తగ్గుతున్న జలాలు

» బోరు బావుల్లో సక్రమంగా నీరురాని వైనం

» సాగర్ నీరు విడుదల చేస్తేనే ఇబ్బందులు తొలిగే అవకాశం

మార్టూరు, మార్చి 31: ఎండలు మండుతున్నాయి. మంచినీటి చెరువులలో నీరు అడుగంటిపోతుంది. వాగులు వంకలపై ఏర్పాటుచేసిన చెక్‌ డ్యాంలలో 90 శాతం చెక్ డ్యాంలు పూర్తిగా ఎండిపోయాయి. వాటిల్లో చిన్నచిన్న నీటి మడుగులు తప్ప నీరులేదు. మరో పది రోజులు గడిస్తే చెక్ డ్యాంలలో నీరులేక మైదాన ప్రదేశాలను తలపిస్తాయి. మంచినీటి చెరువులు కూడా నీటి కుంటలుగా మారాయి. ఇప్పటికే పొలాలు, వాగులు వద్ద చెక్ డ్యాంలలో నీరులేక పశువులకు తాగడానికి నీరు దొరకక పశువులకాపరులు ఇబ్బందులు పడుతున్నారు. కేవలం చెక్ డ్యాంలలో నిల్వ ఉన్న నీటితో పక్కనే పొలాలు కలిగిన రైతులు పశువుల మేతకు పెంపకం చేసేవారు. అయితే, చెక్ డ్యాంలలో నీరు అడుగంటిపోవడంతో గ్రామాలలో నూ భూగర్భజలాలు తగ్గిపోయాయి. చేతి పంపులలో నీరు సక్రమంగా రావడంలేదు. మండలంలోని రాజుగారిపాలెంలో ఏడేళ్ల క్రితం నిర్మించిన ఐదు చెక్ డ్యాంలు ప్రస్తుతం పూర్తిగా ఎండిపోయాయి. వాటి నిర్మాణం జరిగిన తర్వాత చెక్ డ్యాంలు పూర్తిగా ఎండిపోవడం ఇదే తొలిసారని గ్రామస్థులు అంటున్నారు. మండలంలో ఉన్న 15కు పైగా చెక్ డ్యాంలు కూడా పూర్తిగా ఎండిపోయాయి.


రాజుగారిపాలెం చెక్ డ్యాంలో అరకొరగా నీరు


అడుగంటిన మార్టూరు మంచినీటి చెరువు

అడుగంటిన మార్టూరు మంచినీటి చెరువు

పాతికవేలు జనాభా గలిగిన మార్టూరులోని మంచినీటి చెరువులో నీరు అడుగంటిపోతుంది. గతంలో రెండు రోజులకొకసారి మంచినీటిని సరఫరా చేసేవారు. ప్రస్తుతం మూడు, నాలుగు రోజులకొకసారి విడుదల చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. రెండు నెలల క్రితం సాగర్ జలాలను విడుదల చేసినప్పటికీ సక్రమంగా రాలేదు. దీంతో మార్టూరు చెరువుకు అరకొరగానే సాగర్ జలాలు చేరాయి. ఈ వేసవిలో గ్రామంలో తాగునీటి ఇబ్బంది ఏర్పడుతుందని గ్రామ పంచాయతీ వారు ముందస్తుగా చెరువు కట్టపై నాలుగు బోర్లను వేశారు. వాటిలో కూడా సక్రమంగా నీరు రాకపోవడంతో మరో రెండు బోర్లు వేసే ఆలోచనలో ఉన్నారు. మండలంలో 12 మంచినీటి చెరువులు ఉన్నాయి. ప్రస్తుతం అన్ని చెరువులలో నీరు అడుగంటి పోయే దశలో ఉంది. మరో నెల రోజులు గడిస్తే ఈ గ్రామా లలో మంచినీటి చెరువులుకూడా పూర్తిగా ఎండిపోనున్నాయి. ఈక్రమంలో తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడే ప్రమాదం ఉంది. పొలాలులోని నేల బావులు కూడా అడుగంటి పోయాయి. సాగర్ జలాలను విడుదల చేస్తే చెరువులు నింపడం ద్వారా గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు తీరే అవకాశం ఉంది. ఆదిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


మార్టూరు వాగులో నీటి కుంటలు

ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకొనేలా చర్యలు


కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

కావూరివారిపాలెం(చీరాలటౌన్), మార్చి 31: ప్రజల రక్షణకై అన్ని విధాలుగా చర్యలు చేపట్టినట్లు చీరాల రూరల్ సీఐ శేషగిరిరావు, ఈపూరుపాలెం ఎస్సై మర్రి శివకుమార్ పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కావూరివారిపాలెం పంచాయతీ పరిధిలోని కావూరివారిపాలెం, తులసీనగర్, ఆంధ్రకేసరినగర్ గ్రామాలలో ప్రత్యేక పోలీసులతో కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఓటర్లు ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. అశాంతి వాతావరణం కలిగించేలా ఎవరైనా ప్రవర్తిస్తే కఠినచర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది, ప్రత్యేక బలగాలు పాల్గొన్నారు.

పలు గ్రామాలలో కవాతు

పంగులూరు, మార్చి 31: సార్వత్రిక ఎన్నికలు శాంతియుతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో జరగాలన్న ఉద్దేశంతో ఆదివారం ఎస్సై తిరుపతిరావు ఆధ్వర్యంలో పలుగ్రామాల్లో కవాతు నిర్వహించారు. మండలంలోని కశ్యాపురం, రేణింగవరం, కొండమూరు గ్రామాలో 25 మంది బీఎస్ఎఫ్ దళాలతో కలిసి కవాతు నిర్వహించారు.

పేద బాలికలకు రంజాన్ కిట్‌లు పంపిణీ


రంజాన్ కిట్‌ను అందజేస్తున్న ఎఫర్ట్ సంస్థ డైరెక్టర్ జాష్టి వెంకట మోహనరావు దంపతులు

మార్టూరు, మార్చి 31: రంజాన్ మాసం సందర్భంగా మైనారిటీలలో పేద కుటుంబాలకు బాలికలకు పౌష్టికాహార కిట్‌లను ఆదివారం ఎఫర్ట్ సంస్థ అందజేసింది. స్థానిక ఎఫర్ట్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వంద మంది బాలికలకు ఆ సంస్థ డైరెక్టర్ జాష్టి వెంకట మోహనరావు, ఆయన సతీమణి, ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు అనూరాధలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా అనూరాధ మాట్లాడుతూ అమెరికాకు చెందిన ఏకం సంస్థ సహకారంతో పౌష్టికాహార కిట్‌లను బాలికలకు అందజేశామన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు తాళ్లూరి సాంబశివరావు, రావి అంకమ్మచౌదరి, చెన్నుపాటి బసవరాములు, ఇంటూరి ఆంజనేయులు, శానంపూడి లక్ష్మయ్య, ఎం.ఈశ్వర ప్రసాద్ , షేక్ కాజా హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

నవోదయకు ముగ్గురు ఎంపిక

ఇంకొల్లు, మార్చి 31: 20024-25 విద్యా సంవత్సరానికిగాను ఆరవ తరగతి, తొమ్మిదో తరగతిలో ప్రవేశానికి జరిగిన పరీక్షలో ఇంకొల్లు ఆదర్శ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ పరీక్షలో ఐదో తరగతి విద్యార్థులు భగీరథనాయక్, నమీర్, 8వ తరగతి విద్యార్థి షణ్ముక్షప్రియ అర్హత సాధించారు. ఎంపికైన విద్యార్థులను, కోచింగ్ ఇచ్చిన ఉపాధ్యాయులను పాఠశాల కరెస్పాండెంట్ తోటకూర విజయభాస్కర్ అభినందించారు.

కళావతమ్మ మృతికి ఏలూరి సంతాపం

పర్చూరు, మార్చి 31: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు మాతృమూర్తి కళావతమ్మ మృతిపట్ల ఆపార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆదివారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. కళావతమ్మ మృతి బాధాకరమన్నారు. ఆమె పవిత్ర ఆత్మకు శాంతిచేకూరాలని భగవంతుని ప్రార్థించారు. అచ్చెన్నాయుని కుటుంబసభ్యులను ఎమ్మెల్యే ఏలూరి ఫోన్‌లో పరామర్శించారు.

ఎన్నికల ఫిర్యాదుల కాల్ సెంటర్ ప్రారంభం

పర్చూరు, మార్చి 31: పర్చూరు తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం ఎన్నికల ఫిర్యాదుల కాల్ సెంటర్‌ను నియోజకవర్గ ఎన్నికల అధికారి జి.రవీందర్ ప్రారంభించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోభాగంగా ఎక్కడైనా అభ్యంతరకరమైన విషయాలను ప్రజలు ఎన్నికల రిటర్నింగ్ అధికారి దృష్టికి తీసుకుపోయే విధంగా కాల్‌సెంటర్‌ను ప్రారంభించినట్లు చెప్పారు. ఎన్నికల నియమావళిని అతిక్రమించే విధంగా అభ్యంతరాలు ఉంటే 08594243268 నెంబర్‌కు కాల్ చేయాలన్నారు.

ప్రమాదవశాత్తు సుబాబుల్ తోట దగ్ధం


ముక్తేశ్వరంలో దగ్ధమవుతున్న సుబాబుల్ తోటలో మంటలు ఆర్పుతున్నఅగ్నిమాపక సిబ్బంది

బల్లికురవ, మార్చి 31: మండలంలోని ముక్తేశ్వరం గ్రామానికి చెందిన నాగిశెట్టి వేములయ్య అనే రైతుకు చెందిన సుబాబుల్ తోట ఆదివారం ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదంలో దగ్ధమైంది. ముక్తేశ్వరం చెన్నుపల్లి రోడ్డులో కాలువ కట్ట వద్ద ఉన్న నాగిశెట్టి వేములయ్య సుబాబుల్ తోటలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. వెంటనే రైతులు గమనించి మంటలను అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేశారు. మూడు ఎకరాల్లో పంట కాలిపోయిందని బాధిత రైతు తెలిపారు. అద్దంకి నుంచి అగ్నిమాపక యంత్రం వచ్చి మంటలు ఇతర పొలాలకు వ్యాప్తి చెందకుండా అదుపులోకి తీసుకువచ్చారు. బాటసారులు సిగరెట్ వేయడంతో ప్రమాదం జరిగి ఉంటుందని రైతులు అంటున్నారు. ప్రభుత్వం తనకు నష్టపరిహారం అందించాలని రైతు కోరుతున్నారు.

గొట్టిపాటికి ముస్లిం యువకుల సంఘీభావం

అద్దంకి, మార్చి 31: అద్దంకి పట్టణంలోని పలువురు ముస్లిం యువకులు ఆదివారం గొట్టిపాటి రవికుమార్‌ను జొన్నతాళి క్యాంప్ కార్యాలయం వద్ద కలిసి సంఘీభావం తెలిపారు. పట్టణంలోని 17వ వార్డుకు చెందిన ముస్లిం యువకులు షేక్ జబ్బార్, సయ్యద్ మౌలాలి, షేక్ మౌలాలి, సుభాని, మస్తాన్ వలి, మొఘల్ ఇమ్రాన్, హసన్, నాగూర్ షరీఫ్, మస్తాన్, రహమాన్, ఖాశింలు ఆయనను కలిశారు. అలాగే, బోయ సామాజిక వర్గానికి చెందిన ప్రసన్న, మాధవ, చిన్న, నవీన్, ప్రసాద్ తదితరులు సంఘీభావం తెలిపారు.

గోరుముద్దలు కావ్యావిష్కరణ


గోరుముద్దలు కావ్యంను ఆవిష్కరిస్తున్న మహిళలు

అద్దంకిటౌన్, మార్చి 31: పిల్లలను ఆకట్టుకునే విధంగా వరాల గోరుముద్దలు కావ్యాన్ని యనమండ్ర వరలక్ష్మి రచించారని పలువురు కవయిత్రులు అన్నారు. ఆదివారం రాత్రి స్థానిక కమఠేశ్వరస్వామి ఆలయంలో సృజన మహిళ మణుల సమావేశం కొల్లా భువనేశ్వరి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా యనమండ్ర వరలక్ష్మి రచించిన వరాల గోరుముద్దలు కావ్యావిష్కరణ జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న అద్దంకి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ దుర్గా గాయత్రి కావ్యాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా సృజన బృందం రచయిత్రి యనమండ్ర వరలక్ష్మిని సత్కరించారు. కార్యక్రమంలో నర్రా శ్రీలక్ష్మి, వాసవి వనితా క్లబ్ ఇంటర్ నేషనల్ డైరెక్టర్ ఉమా అన్నపూర్ణ, కొత్తమాసు కుసుమలత, మువ్వల విశాలక్ష్మి, దాస్యం లక్ష్మీరాజ్యం, పాలపర్తి జ్యోతిష్మతి, తదితరులు పాల్గొన్నారు.